


# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక అక్టోబర్-2026 ₹25



**పాలపర్తి రాజగోపాల్ ఉమాదేవి స్మారక క్యాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ ఫలితాలు**




**కొత్త హాస్యానందాలు!**

- హాస్య లాస్యం
- సంస్కృత సాహిత్యంలో హాస్యం
- నా చుట్టూ నేను
- ఆనాటి నవ్వులు
- సమ్మానం
- భీమడోలు డేస్






**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548




అక్టోబర్-2026

24 వ సంవత్సరం ✦ 8 వ సంచిక

ముఖచిత్రం: ఆనందముఖారవిందం

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ.300 |
| 2 సంవత్సరాల చందా | రూ.600 |
| జీవిత చందా రూ.5000 | |

Publisher & Editor
Ramu. P

Full pillar: Bnim

Well wishers
Dr. K.V.Ramanachary,(IAS.Retd.)
Dr. K.I.Varaprasada Reddy,
Sri Tanikella Bharani
Sri K.V.V.Satyanarayana
Sri Akshagna Vidya Venkat
Sri Bachi
Dr. V.V.Rama Kumar

Creative Team
Dr. K.Ramakrishna,
Kandlakunta Sarath Chandra
Sudhama, Sarasi, ERM.Raju,
Vadlamannati Gangadhar,
SatyaPrakash, Krishna,Gandhi,
GopalKrishna, Bomman, Nagisetty,
Dayakar, Venkat, Sangram

D.T.P: P.Rama Lakshmi, 9440304993
Digital Media Director: Surya

Hyderabad & Secunderabad Distributers
M.Pandu Ranga, Risingsun News Agency
Abids, Hyderabad-1
Ph:9666680857,6301072906

## హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు విజయదశమి శుభాకాంక్షలు!**

మన పండుగలు ఆనందమయ జీవితాన్ని నిర్దేశిస్తాయి. 'అందరికీ మంచి చేసి... నీవు ఆనందంగా ఉండు!' అని.

హాస్యం అనేది నవ్వును తెప్పించే ఒక సాధనం... ఆనందం అనేది జీవితంలో లభించే ఒక అనుభూతి. హాస్యం బాహ్య ప్రపంచం నుండి వస్తే, ఆనందం అంతరంగం నుండి పుడుతుంది. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ హాస్యంతో ఆనందాన్ని పంచుతున్న హాస్యానందం ఈ సంచిక నుండి మరిన్ని కొత్త శీర్షికలతో కొత్తగా ముస్తాబై మీ ముందుకు వచ్చింది. అయితే ఇక్కడ ముఖ్యంగా ముచ్చటించాల్సిన విషయం ఏమిటంటే... ఏ బాహ్య కారణాలు లేకుండా మంచి కుటుంబంతో... మధుర స్మృతులతో మనం చేయాలకున్న కొన్ని ఇష్టమైన పనులతో ఆనందం మన స్వంతం చేసుకోవచ్చు. అలాగే మన పాత రోజులు తలచుకుని పొందే ఆనందం... అనిర్వచనీయం!



ఆనందం మన మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా మన చుట్టూ ఉన్న వాళ్ళని కూడా ప్రభావితం చేస్తాయి అన్నది నిజం! కాబట్టి మనం ప్రశాంతగా ఉండి... ఆనందాన్ని 'వైఫై'లా మన చుట్టూ ఆవరించేలా చేద్దాం! అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...

రాము.పి

Editorial Office- **Hasyanandam,**
#8-215/4, Near Ramalayam Centre,
**YERRABALEM-522 503,** Mangalagiri, Guntur Dist.
Ph:9849630636.
email: hasyanandam.mag@gmail.com
web: www.hasyanandam.com

Prize Sponcers
K.V.V.Satyanarayana,
P.Srikanth Sarma
Akshagna Publications,
Nimmi Madhubala,
K.Sundaresayya& Satyavathi,
Cartoonist Md.Raj Mohammed,
Cartoonist Ramsheshu

## నవ్వుల చిరునామాలు...

### సీరియల్స్.....


| | | |
|---|---|---|
| **కొంగుచాటు కృష్ణుడు** | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -10 |
| **సినిమా తీద్దామా?** | -గొలుసు సీరియల్ | -44 |


### కథలు.....


| | | |
|---|---|---|
| నయం కాని రోగం | -పి వి రామశర్మ | -22 |
| అదీ తేడా! | -వందన శ్రీనివాస్ | -28 |
| అపార్థాల అనసూయమ్మ | -బీవీ రమణారావు | -38 |


### శీర్షికలు.....


| | | |
|---|---|---|
| హాస్య లాస్యం | -కండ్లకుంట శరత్‌చంద్ర | -5 |
| **ఈనెల ప్రోత్సాహక బహుమతులు** | | -8 |
| సంస్కృత సాహిత్యంలో హాస్యం | -సుధామ | -14 |
| నా చుట్టూ నేను | -బ్నిం | -17 |
| ఆనాటి నవ్వులు | -పొన్నాడ సత్యప్రకాశరావు | -24 |
| సమ్మానం | -గంగాధర్ వడ్లమన్నాటి | -30 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -32 |
| భీమడోలు దేస్ | -సూర్య | -36 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


### కార్టూన్ శీర్షికలు.....


| | | |
|---|---|---|
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -12 |
| నా ఇష్టం | -రాజు | -13 |
| హే భగవాన్ | -భగవాన్ | -16 |
| బడాయి బాబులు | -బొమ్మన్ | -19 |
| స్మైల్ స్టార్స్ | -లేపాక్షి | -26 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -31 |
| మిక్చర్ పొట్లం | -రామ్‌శేషు | -35 |
| చిలుక జో(హా)స్యం | -శాయికృష్ణ | -33 |
| ఇండియన్ ఇంక్ | -శ్రీ సదాశివన్ ఇరియన్ని | -42 |
| ప్రొఫెషనల్ ఫన్ | -నాగిశెట్టి | -46 |
| నవ్వే మందు | -ప్రసిద్ధ | -18 |
| బుడ్డోడు | -సుజయ్‌కృష్ణ | -47 |
| నెల నెల నవ్వుల వెన్నెల | | -48 |


### ఈ నెల ప్రత్యేకాలు.....


| | | |
|---|---|---|
| **ఇంట్లో చేయనిది...** | **-గోపాలకృష్ణ** | -7 |
| **వివిధ సంస్కృతులలో హాస్యం... ప్రాముఖ్యత** | **-ఎ.దయాకర్** | -40 |
| **పాలపర్తి రాజగోపాల్ ఉమాదేవి స్మారక క్యాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ ఫలితాలు** | | -20 |


### ఈ సంచికలో కార్టూనిస్టులు

- సరసి
- రాజు
- బొమ్మన్
- గోపాలకృష్ణ
- ప్రసిద్ధ
- శాయికృష్ణ
- నాగిశెట్టి
- రామ్‌శేషు
- భగవాన్
- సుజయ్‌కృష్ణ
- బాచి
- వడ్డేపల్లి వెంకటేష్
- షేక్ సుభాని
- అరుణ్
- సునీల్
- చక్రవర్తి
- దాస్
- శేషి
- సమైరా
- లాల్
- నూతి
- శేఖర్
- యండమూరి
- మోహన్ కుమార్
- వినోద్
- వర్చస్వీ
- శిరి
- పి.పి.నాయుడు
- శర్మ
- లేపాక్షి
- వందన శ్రీనివాస్
- తోపల్లి ఆనంద్
- టి.ఆర్‌బాబు
- ప్రసాద్‌కాజ
- రాము
- దొరశ్రీ
- శేఖర్‌బాబు
- అత్తలూరి
- జీవీఎస్
- జీఎస్‌ఆర్
- రియాజ్
- సురేష్
- పెండేల
- ఓంకార్

## "దేవుడు చేసిన మనుషుల్లారా... మనుషులు చేసిన దేవుల్లారా..."









**కండ్లకుంట శరత్ చంద్ర**
**+1-236-516-1212**



### ఉచితోత్తమ సలహా!

మీ ఇంట్లో, కుటుంబ సభ్యులందరూ ఒక చోటికి వచ్చి, మీరు చెప్పేది కాస్త వినేలా చేయాలా?...

అయితే, వైఫై ఆపేసెయ్యండి, చాలు! దెబ్బకు... అందరూ లబోదిదో అనుకుంటూ... వైఫై బాక్స్ దగ్గరకు రాకపోతే నన్నడగండి.



### ప్రొఫెషనల్ హాస్యం!

పేషెంట్: డాక్టర్ గారు!... నాకు నిద్రలో నడిచే అలవాటు ఉంది. దానికి ఏదైనా మంచి మందు ఉందా?

డాక్టర్: మెలకువగా ఉన్నప్పుడు బాగా నడవండి. అప్పుడు నిద్రలో లేచి నడవడానికి ఓపిక ఉండదు.



### పెద్దవారి హాస్యం!

ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ గారి వద్దకు ఒక కొత్త రచయిత వచ్చి, తను రాసిన సుదీర్ఘమైన నవలను ఇచ్చి అభిప్రాయం చెప్పమన్నాడు.

కొన్ని రోజులకు రమణ ఆ పుస్తకాన్ని తిరిగిస్తూ, "మీ నవల చాలా బాగుంది. ముఖ్యంగా పుస్తకం చివరన ఉన్న 'సమాప్తం' అనే మాట నన్ను బాగా ఆకట్టుకుంది!" అని తనదైన శైలిలో వ్యంగ్యంగా నవ్వించారు.

### మా మంచి మాస్టర్ గారు!

ఓ టీచర్‌గారు, రాత్రి భోం చేసాక, పిల్లల పరీక్ష పేపర్లు దిద్దుతూ... ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో లెక్కించి, ఒక రిజిస్టర్‌లో రాసే బాధ్యత భార్యామణికి అప్పగించారు.



ఆవిడ ఓ పిల్లవాడి పేపర్లో మార్కులు లెక్కిస్తూ..."ఇదేంటండీ? వీడెవడో తప్పు రాస్తే...మార్క్ వేసారేంటి?" అంది.

"అవునా? ఏం రాసాడు?"

"భరతుడి అన్నయ్య పేరు ఏమిటి?... అని ఒక మార్క్ ప్రశ్న. దానికి రాముడు అని రాయాలి కదా?... భీముడు అని రాసాడు." అంది.

దానికి మాస్టర్ నవ్వి,"ఒక మార్క్ పూర్తిగా వెయ్యలేదుగా!" అన్నాడు.

"అవును! ముప్పాతిక మార్క్ వేసారు."

"రాముడులో 3 అక్షరాలు... అందులో చివరి రెండు అక్షరాలు కరెక్టే రాసాడుగా... 'ముడు' అని. ఏదో పాపం... ఒక్క అక్షరమే తప్పు రాసాడు. అంతేగా! అందుకే ముప్పాతిక మార్క్ వేసా! మొత్తం మార్కులు కౌంట్ వేసాక...ఇంకో పావు మార్కులు కలిపి రౌండ్ ఫిగర్ చేసి మరీ మార్కులు లెక్కించు. పాపం! పిల్లలు పాసవ్వాలిగా!" అన్నాడు నవ్వుతూ.

ఆమె నోరు తెరిచి అలా చూస్తుండిపోయింది.

### హాస్యానందస్వామి ఉవాచ!

భర్తలకు సహనం ఎక్కువ!
ఎందుకో తెలుసా?...
యావజ్జీవభార్యాగార శిక్ష పడిపోయింది కాబట్టి, ఇక సహించడం తప్ప వేరే ఆప్షన్ లేదు నాయనా!



### పంచ్ పవర్!

**కత్తి కంటే కలం గొప్పది!...** అవును నిజమే గానీ... అది గొప్పదో కాదో...'అది ఎవరి చేతిలో ఉంది' అనే దాని పై ఆధారపడి ఉంటుంది.



**కొత్త తిట్టు!**

**ఏయ్! కొడితే... గూగుల్ సెర్చ్‌లో కూడా కనిపించకుండా పోతావ్!**

# రీ సౌండ్




✦ **లాల్, విశాఖపట్నం**

**సె**ప్టెంబర్ 2026 నెల సంచిక ఆద్యం తమూ చదివించింది. హాస్యానందం ప్రతినెల సంచికా చదువుతుంటే నాకు ఒకప్పటి జ్యోతి, ఆంధ్రజ్యోతి తదితర దీపావళి ప్రత్యేక సంచికలు చదివిన అనుభూతి కలుగుతుంది. పత్రికలో జాగ్రత్తగా బాధ్యతతో ఎంపిక చేసిన ఎన్నో చక్కని కార్టూన్లు, మంచి మంచి శీర్షికలు, లబ్ధ ప్రతిష్టులైన కథా రచయితలు రాసిన హాస్యకథలు పాఠకుల్ని అలరిస్తున్నాయి. అయితే నాదొక సూచన. పత్రికలో ఒక రెండు పేజీలు బాలల కోసం(10వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా బాలలే) కేటాయిస్తే బాగుంటుంది.

✦ **పి.వి. పద్మావతి మధు నివ్రితి, సికింద్రాబాద్**

**ఈ**సారి కవర్ పేజీ (అట్టపైన) ముఖచిత్రం రెండింతల అద్భుతం. వినాయకుడు తన ముఖచిత్రంతో ఉన్న హాస్యానందం మాస పత్రిక చదువుతున్నాడు... పైనున్న ఆకాశం నుండి చంద్రుడు కూడా ఆ పత్రికలోని జోకులకు, కార్టూన్లకు నవ్వుతున్నాడు. ఎడిటర్ గారి సృజనాత్మకతకు హ్యాట్సాఫ్. హాయ్...సానందంగా లో రాముగారు ఇచ్చిన తరచు తలచుకొని నవ్వు వచ్చే 'నిజ జీవిత సంఘటనలు' ... నూటికి నూరు 'పాట్లు' నిజం.

✦ **శ్రీలేఖ పి.ఎస్., సికింద్రాబాద్**

**ద**యాకర్‌గారి 'వివిధ సంస్కృతులలో హాస్యం-ప్రాముఖ్యత' కు హ్యాట్సాఫ్. చైనీస్ హాస్యం గురించి అనేక కొత్త విషయాలను వివరించారు (భాషా చమత్కారాలు స్టీఫెన్ చౌ సినిమాలు). భారతీయ సంస్కృతీ హాస్యం ఒక పునశ్చరణలా అనిపించింది (తెనాలిరామకృష్ణ, అక్బర్-బీర్బల్, నారదుడు, కొన్ని సినిమాలు, చాలా మంది హాస్యనటులు మొదలైనవి). భారతీయ సినిమాలో అశ్లీలం, బాధించే జోకులు చట్టం ద్వారా నిషేధించబడాలి (ఉదాహరణలు: వికలాంగులు, పేదవారు, మరుగుజ్జులు, తృతీయ లింగ వ్యక్తులు మొదలైన వారిపై జోకులు).

నాగిశెట్టి గారి ఇండియన్ ఇంక్‌లో 'చిత్ర కళా రత్న' కేరళ కార్టూనిస్ట్ శ్రీనారాయణన్ తేవన్నూర్ గారి గురించి చాల మంచి విషయాలు తెలిసాయి. శవపేటిక లోనుండి సెల్ఫీలు తీయడం కార్టూన్, కొత్తగా మోడ్రన్‌గా ఉన్నది. నారాయణన్ గారు బి.ఎఫ్.ఎ పట్టా పోందారు, ఆర్ట్ టీచర్ అని చదివి ఆశ్చర్య పోయాము.

✦ **ఆర్. శంకరరావు, తిరుపతి**

**హా**స్యానందం చదువుతున్న చంద్రుడు, అపోహతో శాపగ్రస్తుడవటం బాధాకరం! అందుకే మనమందరం పబ్లిగ్గా... ధైర్యంగా హాస్యానందం చదువుదాం! ఎందుకంటే ఇందులో ఎలాంటి అభ్యంతరకర నవ్వులు ఉండవు. దానికి నిదర్శనమే వినాయకుని హాస్యానందం పఠనం! కొత్త శీర్షికల కోసం ఎదురుచూస్తున్నాం! ఎందుకంటే హాస్యానందం ఏం చేసినా వినూత్నంగా ఉంటుందని మా నమ్మకం!




ఇంట్లో
జిమ్ లో!!
చేయనిది...
జిమ్‌లో ఎక్సర్‌సైజులు చేసి-చేసి బాగా టైర్డైపోయా-
నేనొచ్చేసరికి ఇల్లు ఊడ్చి, తడిగుడ్డ పెట్టి, బట్టలుతికి,
పిండి రుబ్బి, కారం కొట్టి మస్తుగా - చేసేసావా రత్తాలు ....
చేసేసానమ్మా-




మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు

**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**






'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.**
**సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి** రూ.1000/-లు
బహుమతిగా ఇస్తున్నారు.

**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**
**ఒకో కార్టూన్‌కి**
**రూ.500/-లు చొప్పున**
**ఈ రెండు కార్టూన్లకు**
**1000 రూపాయలు**
బహుమతి ఇస్తున్నారు.








## శ్రీమతి నమ్మి మధుబాల (బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్) కార్టూన్ కళ పై ఆరాధనతో...

ఈ మూడు కార్టూన్లకు ప్రోత్సాహక బహుమతిగా (మూడు బహుమతులు) 1000 రూపాయలు ఇస్తున్నారు.

**మొదటి బహుమతి రూ.500/-లు**




**రెండవ బహుమతి రూ.300/-లు**




**మూడవ బహుమతి రూ.200/-లు**






శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య, శ్రీమతి సత్యవతి వార్లు ఈ కార్టూన్‌కి 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.






కార్టూనిస్ట్ **ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు** ఈ కార్టూన్‌కి 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.






ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీరామ్‌శేషు** తమ కుమార్తె **మోపురు పావని** జ్ఞాపకార్థం ఈ కార్టూన్‌కి 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.





# కొంగుచాటు కృష్ణుడు




కథ-కథనం
**యండమూరి వీరేంద్రనాథ్**
**యర్రంశెట్టి శాయి**

**"ఆల్‌రైట్!... నా స్కూటర్ మీద సిటీలో ఓ రౌండ్ కొట్టిరా!" అన్నాడు.**

**మన్మథ్ ఆశ్చర్యపోయి..."మరీ ఇంత తేలిక పరీక్షా?! ఇంకేదైనా కష్టమయినది అడుగు! పర్లేదు!!" అన్నాడు జాలిగా.**

**"ఈ చిన్నది చాల్లెండి!" అంటూ స్కూటర్ తాళం ఇచ్చాడు.**

**భార్య చూస్తూ ఉండగా... స్కూటర్ మీద రివ్వు మంటూ వెళ్లి రెండు నిముషాలయినా అవ్వక ముందే...స్కూటరు ఆటోలో వేసు కొని కుంటుతూ తిరిగి వచ్చాడు.**

**"ఆటోవాడు కొట్టేశాడు. అబ్బా! ఈ కాలికేదో అయినట్లుంది!" అన్నాడు బాధగా.**

**"ఇది కాకుండా ఇంకేదైనా చెప్పు!"**

**"అయితే ఓ పని చెయ్! ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి... ఈ దెబ్బలకు కట్లు కట్టించుకుని రా!"**

**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడో వాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. అపార్థాలతో కొట్టుకుంటున్న సాత్విక రావు, రాధాలను కలపడానికి మన్మథుడు, రతీదేవి వాళ్ళ దగ్గరకు వస్తారు.... ఆ క్రమంలో...

"అదెంత పని! ఇప్పుడే వస్తాను. చూస్కో!" అంటూ వెళ్ళి పోయాడు.

గంట, రెండు గంటలయినా అతను రాకపోయేసరికి రతీదేవికి భయం వేసింది.

"ఏమిటింకా మా ఆయన రాలేదు!... మీరు పెట్టిన పరీక్షలో తిరకాసేమీ లేదు కదా?" అడిగింది.

"ఎందుకయినా మంచిది. ఓసారి వెళ్ళి చూద్దాం పదండి!" అన్నాడు సాత్వికరావు.

అందరూ ఆసుపత్రికి చేరుకున్నారు.

అక్కడి వాతావరణం చూసేసరికి ఆ దేవతకి ఏడుపొచ్చేసింది.

"చూడు నాయనా సాత్వికరావూ!... తేలిక ఈ పాడు పరీక్షలకు ఆయన ఒప్పుకున్నాడు.నీ తల్లి లాంటిదానిని. ఎలాగయినా ఆయన్ని కాపాడు నాయనా!" అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

ముగ్గురూ కలిసి అన్ని వార్డులూ వెతికారు.

ఎక్కడా కనిపించలేదు. '...ఫలానా పేషెంట్‌ని ఎక్కడయినా చూశారా' అంటూ డాక్టర్లనూ, నర్సులనూ బ్రతిమాలారు.

"అతని దగ్గర డబ్బులుంటే మొహం గుర్తుంటుంది. బేవార్స్ కేసయితే గుర్తుండదు!" అన్నారు వార్డుబాయ్స్.

చివరకు ఓ కుర్రాడు వాళ్ళ అవస్థ చూసి జాలిపడి, "ఓ వంద రూపాయలిస్తే ఆయన ఎక్కడుంటారో చెప్తాను!" అన్నాడు.

"ఇస్తామోయ్! త్వరగా చెప్పు!... ఎక్కడున్నారు?..." అడిగాడు సాత్వికరావు.

"ముందు క్యాష్ డౌన్ ఫస్ట్!" చేయి చాపుతూ అన్నాడు వార్డ్‌బాయ్.

సాత్వికరావు వంద రూపాయలు ఇచ్చాడు.

వాటిని తీసుకుని–"ఆయన శవం మార్చురీలో ఉంటుంది... వెళ్ళండి!" అన్నాడు.

"అంటే ఆ... ఆయన చనిపోయాడా?" నిశ్చేష్టుడయి అడిగాడు సాత్వికరావు.

రతి నుదుటి వైపు జాలిగా చూసింది రాధ.

"రద్దీ మరీ ఎక్కువయితే, ఎలాగు చావబోయే ఇన్సూరెన్స్ లేని ఇన్-పేషెంట్స్‌ని శవాల గదిలోకి మార్చి... కొత్త వాళ్ళకి ఆ బెడ్

ఇస్తారు. త్వరగా వెళ్ళండి. డెడ్ బాడీ అయినా దొరుకుతుంది. లేకపోతే దాన్ని కూడా దక్కనీయవు ఎలుకలు."

అందరూ మార్చురీకి పరిగెత్తి మన్మథుడిని వెతికి బయటకు వచ్చారు. ఊపిరి ఇంకా ఉంది.

"నీ పరీక్షలు నేను నెగ్గలేను. నా వల్ల కాదయ్యా!" అన్నాడు నీరసంగా.

"అఖ్ఖర్లేదు స్వామీ. మీరు సాక్షాత్తూ దేవుడే. మాకింకేమీ సందేహం లేదు!" అన్నారు సాత్వికరావు, రాధ సాష్టాంగపడుతూ.

"ఈ హాస్పిటల్లో చేరటమే కాకుండా, శవాల గదిలోకి వెళ్ళి బయటకు ప్రాణాలతో రావటం మానవులకు సాధ్యమయ్యే పని కాదు స్వామీ... ఇది కేవలం భగవంతుడికే సాధ్యం!" అంది రాధ.

"నువ్వూ రాధా ఎలాంటి గొడవలూ, కలతలూ లేకుండా ఆనందంగా. ఆదర్శజంటగా గడపాలని మా కోరిక నాయనా. అందుకే ప్రత్యక్షమయ్యాము!" అన్నాడు చిరునవ్వుతో.

నమ్మటం లేదు?" అని రతీదేవి వైపు తిరిగి... "మీరు దివ్యదృష్టితో చూసి చెప్పండి. నేను నిప్పా? తప్పా?" అంది.

"దీనికి దివ్యదృష్టి, హ్రస్వదృష్టి ఎందుకు?" అని సాత్విక్ మన్మథుడి వైపు తిరిగి, "క్యాష్ కౌంటర్ వెనుక చైర్ వేసుక్కూర్చొని... గారెలు, బోండాలు తినేవాళ్ళతో నవ్వుతూ కబుర్లు చెబుతుందని ఈవిడ దగ్గర పనిచేసే మునయ్యే చెప్పాడండి!" అన్నాడు.

"ఓహో! అంటే... పెళ్లికి ముందే నామీద పత్తేదారు పని చేశావన్న మాట... మరి నా గురించి అన్నీ తెలిసినవాడివి పెళ్లి ఎందుకు చేసుకున్నావ్?" రెచ్చిపోయింది రాధ.

"ఆ విషయం ఆనందరావుతో అర్జెంటుగా రెండు మంగళ సూత్రాలు కొనిపించినప్పుడే ఆలోచించుకోవాలి."



ఆ మాట వినగానే సాత్వికరావుకి రాధ మీద మళ్ళీ కోపం వచ్చేసింది.

"దీంతో సంసారం చేయటం నాకిష్టం లేదు స్వామీ. తప్పు చేసినప్పుడు తప్పు జరిగిందని ఒప్పుకోదు!" అన్నాడు.

"ఏం? ఎందుకు ఒప్పుకోవాలి?" అని రతీదేవి వైపు తిరిగి... "పైకి స్వాత్వికంగా కనబడే ఈ సాత్వికరావు బ్యాంకులో ఎన్ని వేషాలు వేస్తాడో, పెళ్లి కాకముందు అమ్మాయిల్ని తన రూముకి తీసుకెళ్లి టేబుల్ టెన్నిస్ బల్ల మీద ఎన్ని గేమ్స్ నేర్పేవాడో ఇతడి కొలీగ్ హరితని అడగండి."

"అబద్ధం! అదంతా చేసేది నాలా ఉండే ఆనందరావు!" అరిచాడు సాత్విక్.

"మరి అదంతా చేసిన ఆ ఆనందరావే ఇదంతా చేశాడంటే ఎందుకు

"ప్రేమించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఉత్తరం వ్రాయక ముందే నువ్వూ ఆలోచించుకోవాలి."

రతీమన్మథులు మళ్ళీ ఇద్దరి మధ్యకు వచ్చారు.

"ఇదిగో చూడండి! మీ ఇద్దరూ... కొద్ది నిముషాలు మీ పోరాటం ఆపితే నేను ఓ ఉపాయం చెప్తాను!" అన్నాడు మనసిజుడు.

"ఏమిటది?" ఇద్దరూ జంటగా అడిగారు.

"మీ ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి నమ్మకం లేదు... భార్య ఇంట్లో పడే శ్రమ గురించి భర్తకీ, భర్త ఆఫీస్‌లో పడే పాట్లు భార్యకూ తెలీదు. భర్త బ్యాంకులో ప్రేమాయణం సాగిస్తున్నాడని భార్య, భార్య హోటల్ దగ్గరేదో వ్యవహారం నడిపిస్తోందని భర్తా అనుమాన పడుతున్నారు...







అపోహలు తొలిగి ఇద్దరి మనసులూ నిర్మలంగా అవాలంటే ఇద్దరి ఆత్మలూ మార్చుకోవాలి."

దంపతులిద్దరూ... ఒకరి ముఖాలొకరు చూసుకుని, అర్థం కాక బ్రహ్మ ముఖంలోకి చూశారు.

రతీదేవి చిరునవ్వుతో వివరంగా చెప్పింది.

"మరేం లేదు. 24 గంటల సేపు మేము మీ ఆత్మలని తారుమారు చేస్తాము. ఆఫీసులో సాత్వికరావు ఎలా ప్రవర్తిస్తున్నాడో, బ్యాంకులో పని వత్తిడి ఎంత ఉంటుందో నీకు తెలుస్తుంది. అలాగే హోటల్ వ్యాపారంలో కష్టాలు, కష్టమర్లతో వ్యవహారాలు నీకు తెలుస్తాయి."

ఇద్దరికీ ఈ ఆలోచన చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

"ఓకే. నాకు నచ్చింది ప్లాన్!..." అన్నాడు సాత్విక్.

"నేనూ ఒప్పుకుంటున్నాను." అంది రాధ.

"అయితే ఇద్దరూ... ఇలా నా ఎదురుగా కూర్చోండి!" నేల మీద కూర్చుంటూ అన్నాడు మన్మథ్.

ఇద్దరూ ఎదురుగా కూర్చున్నారు.

కళ్ళు మూసుకోమని సైగ చేశాడు. రెండు నిముషాల్లో ఆత్మల మార్పిడి జరిగిపోయింది.

"ఇంక కళ్ళు తెరవండి నాయనా!..." అంది రతి.

ఇద్దరూ కళ్ళు తెరిచి ఉలికిపాటుతో లేచి నిలబడ్డారు. తనకు ప్యాంటూ షర్టూ పోయి చీరా జాకెట్టూ... ఇంకా కొన్నిపోయి... కొన్ని రావటం చూసి సాత్వికరావు నిశ్చేష్టుడయ్యాడు.

ఆత్మల మార్పిడి అంటే మరీ ఇంత పచ్చిగా ఉంటుందని అనుకోలేదు.

తనని తాను చూసుకుని రాధ కిలకిల నవ్వేసి–"నాకంతా గిలిగిలిగా ఉంది బాబూ..." అంది సిగ్గుతో ముఖం కప్పుకొని.

"మేమిక వెళ్తున్నాము భక్తా! 24గంటల తరువాత మళ్ళీ ఎవరి ఆత్మలు వారికి మారతాయి. ఆ తరువాత మీ సంసారం మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగిపోతుంది. ఈ రాత్రికి కక్కుర్తిపడి కడుపు కాయ కాయకుండా చూసుకోండి. అప్పుడిక తిరిగి మార్చటం ఎవరి చేతుల్లోనూ ఉండదు!" అన్నాడు.

"కానీ ఒక్క సందేహం స్వామీ... మా మీద ఇంత ప్రేమ, ఇంత కారుణ్యం ఎందుకు కలిగాయి మీకు?" అని అడిగింది రాధ.

సమాధానం చెప్పబోతున్న మన్మథుని నోరు ఠక్కున మూసి... "ఇదంతా లోకకల్యాణం కోసమేనమ్మా!" అన్నది రతి. ఇద్దరూ అంతర్ధానమయి పోయారు.

✦✦✦





తెల్ల మల్లెల గర్వాన్ని పరిహసించటానికి లేతచెక్కిళ్ళనీ, దొండపండు అహంకారాన్ని అదిలించటానికి పెదవులనీ, పాపికొండల మిడిసి




పాటు తగ్గించటానికి పాలిండ్లనీ, పోకచెక్కల పొగరు పొగచటానికి, కుచాగ్రములనీ, ఇంద్రధనస్సు అతిశయాన్ని అణచటానికి కనుబొమ్మ లనీ, చక్రవాకముల గర్వము నిగర్వమయ్యేలా జఘనాన్నీ, మల్లె తీవే సిగ్గుపడేలా నడుమునీ సృష్టించి ఆమెని తయారుచేశాడు బ్రహ్మ.

ఆమె పేరు సిరినాగ. పాతాళ రాజు ముద్దుల కుమార్తె. వాసుకికి పది రెట్ల శరీరాకృతి గల సర్ప శ్రేష్టములు కాపలా కాసే ఆ పాతాళ రాజు కోట సాగరాంతర్భాగాన ఉన్నది. చుట్టూ అగ్నిపర్వతములు, సుడిగుండాలు, ఆద్యంతం లేని గుహలు... అనుమతి లేకుండా ఆ కోట ప్రవేశం సమీరానికి కూడా దుర్భేద్యం..! ఇంద్రుడైనా, అష్టదిక్పాలకులైనా అనుమతి తీసుకుని వెళ్ళాల్సిందే. ఇటువంటి కోటలో చెలికత్తెల మధ్య అల్లారుముద్దుగా పెరిగింది సిరినాగ.

ఆమె తన జీవితంలో ఇప్పటి వరకూ పరాయిపురుషుడిని చూడలేదు.

ఆ రాత్రి ఆమెకు ఒక కల వచ్చింది.

అందులో తనకు మించిన సౌందర్యవతి కనబడింది. అయితే వయసులో పెద్దది. ఆమె అద్భుత సౌందర్యానికి విస్తుబోయి అప్రయత్నంగా చేతులు జోడించి "ఎవరు నువ్వు" అని అడిగింది సిరినాగ.

"నా పేరు రతీదేవి. మన్మథుడి భార్యను."

"ఓహో! అందుకేగా అంత అందంగా ఉన్నావు?"

"నా అందానికి ఏమిలే...వయసు మింగిన అందం నాది. నీకో విషయం చెబుదామని వచ్చాను."

"చెప్పు తల్లీ! ఏమిటది?" కుతూహలంగా ప్రశ్నించింది సిరినాగ.

"రేపు సాయంత్రం సాగరపు ఉపరితలానికి వెళ్ళు. అక్కడ నీకు ఒక అద్భుతమైన అందగాడు కనపడతాడు. అతడిని వివాహమాడు. నీ జీవితం అతి సుందరమవుతుంది!"

"అతను ఎవడో ఎలాంటి వాడో తెలీదు కదా!"

"నేను చెప్తున్నాను కదా! అతి మంచివాడు. అతిలోక సుందరుడు. ముల్లోకాల్లోనూ అతడిని మించిన సుగుణవంతుడు మరి లేడు."

"కానీ మా తండ్రిగారు ఒప్పుకోవాలి కదా!"

"అక్కడికే వస్తున్నాను. నీకు బాణాసురుడి కూతురు ఉష తెలుసు కదా!"

"అవును. తెలుసు. బాణాసురుడు బలి చక్రవర్తి కుమారుడు. ఎవరైనా తన సమఉజ్జీతో యుద్ధం చెయ్యాలని అతని జీవితేచ్ఛ. ఉష అతని కుమార్తె!"

**(సశేషం)**



# సంస్కృత సాహిత్యంలో హాస్యం



సుధామ
9849297958



**నవ్వడం మనిషికి సహజం. అయితే కొందరు నవ్వుతారు... మరికొందరు నవ్విస్తారు... ఇంకొందరు తమకు తెలియకుండానే తాము నవ్వనట్లు ఉంటూనే అందరినీ నవ్విస్తారు!**

**సంస్కృత సాహిత్యంలో ఈ మూడు రకాలవారికీ కొదవ లేదు. రాజులు ప్రేమలో పడతారు; విదూషకులు భోజనంపై పడతారు; కపట సన్యాసులు పరస్పరం తగువులాడతారు; మూర్ఖులు తాము కూర్చున్న కొమ్మనే నరుకుతారు. వీరందరినీ చూసి పాఠకులుగా మనం నవ్వుతాము. కానీ ఆ నవ్వులలోంచి తేరుకున్న తరువాత, అందులో దాగిన జీవితసత్యం మెల్లగా మనసులో మెదులుతుంది.**



భరతముని నాట్యశాస్త్రం హాస్యానికి శాస్త్రీయమైన ఆసనం వేసింది. అందుకే ఆయనను నవ్విస్తూ నడిపించిన నాట్యాచార్యులు అనచ్చు. నాట్యశాస్త్రం హాస్యరసానికి స్థాయీభావం 'హాసం' అని చెప్పింది. విచిత్రమైన దుస్తులు ధరించడం, చేష్టలు చేయడం, అసందర్భంగా మాట్లాడడం, తెలియని విషయాన్ని తెలిసినట్లు నటించడం, ఇతరులను అనుకరించడం, అకారణంగా గొప్పలు చెప్పుకోవడం... ఇవన్నీ హాస్యానికి కారణాలు. అంటే ఇప్పటి రాజకీయ సభలు, సామాజిక మాధ్యమాలు భరతముని కాలంలో ఉండి ఉంటే, హాస్యానందానికి ఉదాహరణలు వెతకడానికి ఆయనకు పెద్దగా శ్రమ ఉండేది కాదు!

భరతుడు నవ్వును స్మితం, హసితం, విహసితం, ఉపహసితం, అపహసితం, అతిహసితం అని ఆరు రకాలుగా విభజించాడు.

పెదవుల చివర స్వల్పంగా కనిపించేది 'స్మితం'. కొద్దిగా పళ్లు కనిపిస్తే 'హసితం'. శబ్దం బయటకు వస్తే 'విహసితం'. ఎదుటి వారిని ఎగతాళి చేస్తే 'ఉపహసితం'. ఒళ్లంతా కదిలేలా నవ్వితే 'అపహసితం'. ఇక పొట్ట పట్టు కొని, కన్నీళ్లు కారేలా నవ్వితే 'అతిహసితం'. నేటి భాషలో చెప్పాలంటే, చిరునవ్వు గుర్తు నుంచి 'నవ్వుతూ కన్నీళ్లు కార్చే' గుర్తు వరకు అన్నింటినీ భరతుడు ఆనాడే గుర్తించాడు. పేరు మాత్రమే 'ఎమోజీ' అని పెట్టలేదు!

సంస్కృత నాటకాలలో హాస్యశాఖను చాలా వరకు తన భుజాలపై మోసినవాడు విదూషకుడు. సాధారణంగా అతడు కథానాయకుడైన రాజుకు ప్రాణమిత్రుడు. రాజు రాజ్యాన్ని పాలిస్తుంటే, విదూషకుడు రాజు ప్రేమ వ్యవహారాన్ని పాలిస్తుంటాడు.

రాజు ప్రేయసి కోసం ఆలోచిస్తే, విదూషకుడు భోజనం కోసం ఆలోచిస్తాడు.

భరతుడు నవ్వును
స్మితం, హాసితం, విహాసితం, ఉపహాసితం,
అపహాసితం, అతిహాసితం అని ఆరు
రకాలుగా విభజించాడు. 'సంస్కృతం'
సంస్కరించబడిన భాష అయితే,
అందులోని హాస్యం ఆనందింపచేస్తూనే
మనిషిని సంస్కరించే చమత్కార ఔషధం!

రాజుకు విరహవేదన; విదూషకుడికి ఆకలి వేదన! రెండూ తీవ్రమైనవే అయినా, ప్రేక్షకులు మాత్రం విదూషకుని బాధకే ఎక్కువగా నవ్వుతారు.

కాళిదాసు రచించిన అభిజ్ఞానశాకుంతలంలో మాఢవ్యుడు దుష్యంతుని విదూషకుడు. రాజుతో కలిసి వేటకు వెళ్లిన అతనికి అడవి జీవితం ఏ మాత్రం నచ్చదు. రాజు జింక వెంట పరుగెదుతుంటే, మాఢవ్యుడు భోజనం ఎప్పుడు

దొరుకుతుందా అని ఎదురుచూస్తుంటాడు.

రాజు మనసంతా శకుంతలతో నిండిపోతే, మాధవ్యుని మనసంతా అలసటతోనూ ఆకలి తోనూ నిండిపోతుంది. దుష్యంతుడు శకుం తల అందాన్ని వర్ణిస్తుంటే... 'ఈ ప్రేమ వ్యవ హారం భోజన సమయాన్ని మరింత ఆలస్యం చేస్తుందేమో!' అన్నట్లుంటుంది మాధవ్యుని ధోరణి.

ఒక సందర్భంలో దుష్యంతుడు శకుంత లపై తన ప్రేమను విదూషకునికి చెప్పి, వెంటనే దానిని పరిహాసమని కొట్టిపారేస్తాడు. మాధవ్యుడు దానిని నిజంగానే నమ్మేస్తాడు.

ప్రేమలో ఉన్నవారి మాటలను అక్షరాలా నమ్మడం ఎంత ప్రమాదక రమో అతనికి తెలియదు!రాజు ప్రేమ రహస్యాన్ని దాచాలనుకుంటాడు; విదూషకుడు అసలు రహస్యమే లేదని అనుకుంటాడు.

ఇక్కడి అపార్థం ఎంతో సహజ మైన హాస్యాన్ని సృష్టిస్తుంది.

మాళవికాగ్నిమిత్రంలో గౌతముడు అనే విదూషకుడు మరింత చురుకైనవాడు.

రాజు అగ్నిమిత్రుడు మాళవికను చూడాలని తహతహలాడుతుంటాడు. నేరుగా "ఆమెను పిలిపించండి" అంటే రాజుగారి గౌరవానికి ఇబ్బంది! అందుకని గౌతముడు ఇద్దరు నాట్యా చార్యుల మధ్య "మీలో గొప్ప గురువు ఎవరు?" అనే వివాదాన్ని రగిలిస్తాడు.

గురువుల మధ్య గొడవ మొదలైతే శిష్యుల ప్రదర్శన తప్పదు. అలా మాళవిక నాట్యం చేస్తుంది; రాజు ఆమెను చూస్తాడు; విదూష కుని పథకం ఫలిస్తుంది. ప్రేమికుడైన రాజుకు మార్గం చూపడంలో గౌతముడు నేటి కార్య క్రమ నిర్వాహకులకన్నా నేర్పరి!

శూద్రకుని మృచ్ఛకటికంలో మైత్రేయుడు చారుదత్తుని మిత్రుడు.



చారుదత్తుడు గుణవంతుడు, కానీ పేద వాడు. మైత్రేయుడు అతని దారిద్ర్యాన్ని చూసి బాధపడుతూనే సందర్భానుసారంగా చమత్కరి స్తాడు. ఖాళీ ఇంట్లో దొంగతనం చేయడానికి వచ్చిన దొంగ పరిస్థితి ఎలా ఉంటుందో... ఊహించండి! "ఇక్కడ దొంగిలించడానికి ఏమీ లేదే!" అని దొంగే విచారించవలసి వస్తుంది. పేదరికం విషాదమైనదే అయినా, రచయిత దానిని సున్నితమైన హాస్యంతో చూపిస్తాడు.

ఇదే నాటకంలోని శకారుడు మరో విచిత్ర మైన హాస్యపాత్ర. అధికారం ఉంది; వివేకం లేదు. మాటలున్నాయి; వాటికి సరైన అర్థం లేదు. పురాణపాత్రల పేర్లను కలగాపులగం చేస్తూ మాట్లాడతాడు. తన తప్పులు తనకు తెలియవు; ఇతరుల తప్పులు మాత్రం వెంటనే కనిపిస్తాయి. ఇలాంటి పాత్రలు నాటక రంగం లోనే ఉంటాయని అనుకుంటే, అది మన అమాయకత్వమే! శకారుని చూసి నవ్వుతున్న ప్పుడు, సమాజంలోని అధికార మదాంధులు మనకు గుర్తుకొస్తారు.

ప్రహసనాల్లో హాస్యం మరింత స్వేచ్ఛగా పరుగులు తీస్తుంది. మహేంద్రవర్మ రచించిన మత్తవిలాస ప్రహసనంలో మద్యం తాగిన కాపాలికుడు తన భిక్షాపాత్రను పోగొట్టు కుంటాడు. తాను ఎక్కడ పెట్టాడో గుర్తులేదు; కానీ బౌద్ధభిక్షువే దొంగిలించాడని అనుమానం మాత్రం గట్టిగా ఉంటుంది. తన మతం గొప్ప దని కాపాలికుడు అంటాడు; తన మార్గమే ఉత్తమమని బౌద్ధభిక్షువు వాదిస్తాడు.

పాత్ర ఎక్కడుందో తెలియదు గానీ, వాదన మాత్రం విశ్వమంతా తిరుగుతుంది. చివరికి దానిని కుక్క తీసుకుపోయిందని తెలుస్తుంది. మనుషులు మతవివాదంలో మునిగిపోతే, అసలు నిజాన్ని ఒక కుక్క బయటపెట్టడం ఇక్కడి గొప్ప వ్యంగ్యం!






భగవదజ్జుకంలో హాస్యం శరీరాలను మార్చుకొని వస్తుంది. ఒక యోగశిష్యుని ఆత్మ యువతి శరీరంలోకి, యువతి ఆత్మ శిష్యుని శరీరంలోకి ప్రవేశిస్తాయి. యువతి శరీరంలో ఉన్న శిష్యుడు వైరాగ్యాన్ని బోధిస్తాడు. శిష్యుని శరీరంలో ఉన్న యువతి ప్రేమ, అలంకరణల గురించి మాట్లాడుతుంది.

చూసేవారికి శరీరం ఒకటి; వినిపించే మాటలు మరొకటి!

“మనిషి అంటే శరీరమా? ఆత్మా?...” అనే గంభీరమైన ప్రశ్నను రచయిత నవ్వుల మధ్య మన ముందుంచుతాడు.

పంచతంత్రంలో జంతువులు మాట్లాడతాయి; కానీ అవి చేసే పొరపాట్లు మాత్రం అచ్చంగా మనుషులవే.

నీలిరంగులో మునిగిన నక్క... తాను దేవుడు పంపిన రాజునని ప్రకటిస్తుంది.

ఇతర జంతువులు దాని రంగు చూసి... నమ్ముతాయి.

ఒకరోజు తోటి నక్కల అరుపు వినగానే... అది కూడా సహజంగా అరుస్తుంది.

అంతే!... కొత్త రంగు వెలిసిపోకముందే పాత స్వభావం బయటపడుతుంది!

పదవి, దుస్తులు, రంగు మారవచ్చు... గొంతు విప్పితే అసలు వ్యక్తి తెలిసిపోతాడని ఈ కథ నవ్విస్తూ చెబుతుంది.

క్షేమేంద్రుని దేశోపదేశం, నర్మమాల వంటి రచనల్లో కపట పండితులు, లోభి వైద్యులు, అవినీతిపరులు, మోసగాళ్లు హాస్యానికి లక్ష్యాలవుతారు.

రోగికన్నా రోగి జేబుపైనే ఎక్కువ శ్రద్ధ చూపే వైద్యుడు; జ్ఞానంకన్నా ప్రదర్శన ఎక్కువగా ఉండే పండితుడు; ప్రజాసేవకన్నా స్వసేవకు ప్రాధాన్యమిచ్చే అధికారి... వీరందరినీ క్షేమేంద్రుడు తన వ్యంగ్యపు అద్దంలో చూపించాడు.

ఈ విధంగా సంస్కృత సాహిత్యంలో హాస్యం కేవలం పొట్ట చెక్కలయ్యేలా నవ్వించడానికి ఉద్దేశించినది కాదు... అది అహంకారానికి సూది గుచ్చింది; మూర్ఖత్వానికి అద్దం పట్టింది; కపటత్వపు ముసుగును తొలగించింది.

చేదు నిజాన్ని నేరుగా చెబితే మనిషికి కోపం రావచ్చు. అదే నిజాన్ని చమత్కారంగా చెబితే ముందుగా నవ్వుతాడు; తరువాత ఆలోచిస్తాడు. అందుకే సంస్కృత హాస్యం మనల్ని నవ్వించి వదిలిపెట్టదు!

“నువ్వు నవ్వుతున్నది ఎవరిని చూసి? ఆ లక్షణం నీలోనూ ఉందేమో చూసుకున్నావా?” అని మెల్లగా ప్రశ్నిస్తుంది!

అసలుసంస్కృతం' అంటేనే సంస్కరించబడినది, చక్కగా తీర్చిదిద్దబడినది, పరిశుద్ధమైనది అని అర్థం.

ఆ భాషలోని హాస్యం కూడా అలాంటిదే!

ఎవరినో కించపరచి నవ్వించే అపహాస్యం కాదు; మనలోని అహంకారం, అవివేకం, కపటత్వాలను చమత్కారంగా ఎత్తిచూపి సంస్కరించే పరిహాసం. అందుకే సంస్కృత హాస్యం మొదట మన పెదవులపై నవ్వును పూయించి, తరువాత బుద్ధికి పదును పెట్టి, చివరకు స్వభావాన్ని సరిదిద్దుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే... 'సంస్కృతం' సంస్కరించబడిన భాష అయితే, అందులోని హాస్యం ఆనందింపచేస్తూనే మనిషిని సంస్కరించే చమత్కార ఔషధం!

**అదీ సంస్కృత'హాస్యానందం'**






## నరుడా... ఏమి నీ కోరిక!

**ఏ.ఐ...** అంటే... అడిగింది ఇచ్చేది!

'డిజిటల్ అల్లావుద్దీన్ అద్భుత దీపం!

దాని అసలు పేరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అట!

సాంకేతిక ప్రపంచంలోకి పిల్లిలా మెల్లగా ప్రవేశించి, ఇప్పుడు రోకలిలా నెత్తికి చుట్టుకుంటున్న ఒక అద్భుతం...

కాదు... అదో భూతం!

నిజానికి ప్రస్తుతం ఇది ప్రతి ఒక్కరి చేతిలోనూ ఒక 'ఉచిత ఆటబొమ్మ'.

లయకి ఒదగని... భావప్రాణం లేని... 'రిథమ్ లెస్ నాన్ సెన్స్'. లిరిక్స్ ఇస్తే చాలు, 'సంగీత సామ్రాట్' తరహాలో పాటలు కట్టేస్తోంది!

బర్త్‌డేలు, పెళ్లిళ్లు, చివరకు... 'డాష్ డాష్' లకి కూడా రంగురంగుల గ్రీటింగ్ కార్డులు క్షణాల్లో డిజైన్ అయిపోతున్నాయి. మనం సరిగ్గా 'ప్రాంప్టింగ్' ఇస్తే చాలు... ఇవ్వకపోయినా సరే... మన పిచ్చి ఆలోచనలకి కూడా రాజసంతో కూడిన రూపం ఇచ్చేస్తోంది.

సలహాలు ఉచితంగా పారేస్తోంది.

ప్రోగ్రామ్ ప్లానింగ్‌లు, ఘాటు ఉపన్యాసాలు... చివరికి ఆ పసిపిల్లలకి ఇంగ్లీషు స్కూళ్ళు ఇచ్చే పరమ వ్యర్థమైన 'హోమ్‌వర్క్' శిక్షలని కూడా తానే రాసేసి పిల్లలకి రెస్ట్ ఇచ్చేస్తోంది!

ఇప్పటివరకు వచ్చిన ఇన్వెన్షన్లన్నీ మనిషి కాళ్లకి, చేతులకి సోమరితనం నేర్పిస్తే... ఈ ఏఐ ఏకంగా 'మెదడుకి సెలవు' ప్రకటించేసింది.

మెదడుతో పనిలేకుండానే కవులని, రచయితలని, ఉపన్యాసకులని గొర్రెల కాపరుల్లా తయారుచేసి ప్రోత్సహిస్తోంది!

ఇక చిత్రకారుల సంగతి సరేసరి!

ఒక రఫ్ డిజైన్ వేసి 'దీన్ని ఫైనల్ చెయ్' అంటే క్షణాల్లో చేసేస్తోంది.

అసలు గీత గీయడం చేతకాని దద్దమ్మలు కూడా... 'ఎలుక సింహాన్ని తరుముతోంది... ఇంతలో చీమ వచ్చి డిష్క్యుం...డిష్క్యుం... అని చివాట్లు పెడుతోంది" అని టైప్ చేస్తే చాలు... అచ్చం అలాగే పెయింటింగ్ వేసి చేతిలో పెడుతోంది!

ఒకప్పుడు ఫ్లెక్సీలు, ఫోటోషాప్‌లు వచ్చి ఆర్టిస్టుల నడ్డి విరిస్తే... ఇప్పుడు ఈ ఏఐ వచ్చి ఏకంగా 'ఆర్టిస్టులే ఆత్మహత్య చేసుకునే సదుపాయాన్ని' చాలా సౌకర్యవంతంగా సమకూర్చింది!

ఇక ఈ మధ్య ఈ వీడియో క్రియేషన్ తెచ్చిన తుఫాను చూస్తుంటే, దేవుడు కూడా స్క్రీన్ వైపే చూస్తూ నోరెళ్లబెడుతున్నాడు!

రోడ్డు మీద ఐశ్వర్యారాయ్‌కి సైడ్ ఇవ్వడానికి కూడా జంకే రకం... ఇప్పుడు ఏఐ పుణ్యమా అని ఆమెతో 'చెమ్మచెక్క' డ్యూయెట్ ఆడుతున్నట్టు... లైవ్ సినిమా యాక్టర్ల పక్కన మాస్ డాన్స్ వేస్తున్నట్టు వీడియోలు క్రియేట్ చేసేసుకుంటున్నారు. అసలు యాక్టర్లు ఏమో కోట్లు పెట్టి షూటింగ్‌లు చేసుకుంటుంటే... మనోళ్లు మాత్రం ఇంట్లో లుంగీతో కూర్చుని ఐశ్వర్యారాయ్‌తో డుయెట్లు పాడేస్తున్నారు!

ఇక్కడ మరో గమ్మత్తు ఉంది...

అదే 'విత్తం కొద్ది వైభోగం!' మనం ఎంత డబ్బు తగలేస్తే... అంత విచ్చలవిడితనం ప్రదర్శించే క్రేజీ యాప్‌లు మార్కెట్లో సిద్ధంగా ఉన్నాయి.




**ఇప్పటివరకు వచ్చిన ఇన్వెన్షన్లన్నీ మనిషి కాళ్లకి, చేతులకి సోమరితనం నేర్పిస్తే... ఈ ఏఐ ఏకంగా 'మెదడుకి సెలవు' ప్రకటించేసింది. మెదడుతో పనిలేకుండానే కవులని, రచయితలని, ఉపన్యాసకులని గొర్రెల కాపరుల్లా తయారుచేసి ప్రోత్సహిస్తోంది! రూపం లేని 'త్రివిక్రమదేవుడిలా' చేతులు కట్టుకుని నిలబడి... "నరుడా... ఏమి నీ కోరిక?" అంటూ రక రకాల పేర్లతో మీ మొబైల్‌లోనే పలకరిస్తోంది!**







అశ్లీల చిత్రాలు, ఊహలకే అందని సజీవ కదలికలతో కూడిన విపరీతమైన వీడియోలను కూడా ఎటువంటి సిగ్గు ఎగ్గు లేకుండా వండి వార్చేస్తున్నాయి.

దేవుడి దయ వల్ల ఆ యాప్‌లకి 'ఖరీదు' కాస్త ఎక్కువగా ఉంది కాబట్టి సరిపోయింది కానీ... లేకపోతే ఈ పాటికి వీధికి ఒక బాలీవుడ్ మ్యూజిక్ వీడియో రిలీజ్ అయ్యేది!

ఇక ఫొటోలయితే ఊసరవెల్లుల్లా రంగులు మారుతున్నాయి.

ఇంట్లో ఖాళీగా కూర్చుని... ప్రధానితో టీ తాగుతున్నట్టు... అమెరికా ప్రెసిడెంట్‌కి షేక్ హ్యాండ్ ఇస్తున్నట్టు ఫోటోలు తీయించేసుకోవచ్చు. మనకి తెలియకుండానే వెనకాల బ్యాక్ డ్రాప్‌లు మార్చేసి, మంచం మీద పడుకునే ప్రపంచ యాత్రలు చుట్టేస్తున్నాం.

అన్నిటికంటే పెద్ద విచిత్రం ఏమిటంటే... "ఏఐ గర్ల్ ఫ్రెండ్ చాటింగ్!"

రియల్ వరల్డ్‌లో పిల్ల పడకపోతేనేం... మొబైల్‌లో ఏఐ ఉందిగా!

"ఏరా పడుకున్నావా...? కాసేపు కబుర్లు చెప్పరాదా?" అని గోముగా మెసేజ్ పెడితే చాలు... అర్ధరాత్రి దాటినా విసుక్కోకుండా, ఉలిక్కిపడి లేచి... 'ఎమోషనల్ సపోర్ట్' ఇచ్చే ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్ వచ్చేశారు.

అయితే అందరూ ఆ మురికి ఊబిలో పడిపోలేదు లెండి!

మన అదృష్టం కొద్దీ కొన్ని అతి బుద్ధిమంతులైన 'ఏ.ఐలు' కూడా మన మధ్య తిరుగుతున్నాయి.

ఉదాహరణకి... జెమిని ఫ్లాష్, చాట్ జీపీటీ, బనానా లాంటి బంగారు కొండలు ఉన్నారు! పాపం వీళ్లు చాలా పద్ధతిగల పిల్లలు.

ఎంత డబ్బిచ్చినా,ఎలాంటి ప్రాంప్ట్ ఇచ్చినా, బుద్ధిగా చదువుకునే పిల్లల్లా నీతులు చెప్తారు తప్ప, నిమిషంలో దారి తప్పరు!

ఏ.ఐ అంటే.. పడనివాళ్లు, భయ-పడే వాళ్లు... "కోతికి కొబ్బరికాయ దొరికినట్టుంది" అని తెగ బాధపడిపోతున్నారు.

కానీ ఏఐ మాత్రం... రూపం లేని 'త్రివిక్రమదేవుడిలా' చేతులు కట్టుకుని నిలబడి... "నరుడా... ఏమి నీ కోరిక?" అంటూ రకరకాల పేర్లతో మీ మొబైల్‌లోనే పలకరిస్తోంది!

ఏ.ఐ. విషయంలో కూడా... అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్టే వ్యవహరించాలి!









రాత, గీత
BOMMAN

మన చుట్టు పక్కల సాదా సీదా జనాలతో
పాటూ... మందు బాబులు,
విందు బాబులతో పాటు... బడా బాబులు,
బడాయి బాబులూ ఉంటారు...
వీళ్లలో ఈ **బడాయి బాబుల బడాయే**
మన కథకి మూలం!





# పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు

## అంశం: మాటల్లేవ్!...మాట్లాడటాల్లేవ్!



**కొంటె** బొమ్మలు మౌనంగా వున్నా... మనసుని గిలిగింతలు పెడతాయి. పెదవులపై చిరునవ్వులు పూయిస్తాయి. మన పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక 'మాటల్లేవ్... మాట్లాడటాల్లేవు' క్యాప్షన్‌లెస్ కార్టూన్ పోటీకి 250కి పైగా కార్టూన్లు అందాయి. హాస్యభావస్పోరకంగా, చూడగానే నవ్వులు పండించేవి న్యాయనిర్ణేత శ్రీబ్నింగారి మెప్పు పొందాయి.

ఐడియాలు బావున్నా... రెండు ఫ్రేములున్నవి, అక్షరాలేవైనా ఉన్నా, ఇంకా ఏఐ లో జనరేట్ చేసిన కార్టూన్లను పరిగణలోకి తీసుకోలేదు.

పోటీలో పాలుపంచుకున్న కార్టూనిష్టులకు, ఆదరిస్తున్న కార్టూన్ ఇష్టులకు, హాస్యానందం రథసారథి రాముగారికి హృదయ పూర్వక నమస్సులు.

**-పాలపర్తి శ్రీకాంత్, పోటీ నిర్వాహకులు**

### స్పెషల్ కార్టూన్




న్యాయనిర్ణేత- **శ్రీ బ్నిం**

**ఒకో కార్టూన్‌కి 1000 రూపాయలు బహుమతి + ప్రశంసాపత్రం**






















**బహుమతి ప్రదానం**

**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారి**

**'బ్నిం' పుస్తకావిష్కరణ సభలో...**

**అక్టోబర్, 28 సాయంకాలం 6 గంటలకు**

**హైదరాబాద్ రవీంద్రభారతి**

**కాన్ఫరెన్స్ హాల్‌లో.**



# నయం కాని రోగం

పి.వి.రామశర్మ, 9490244344

**"డాక్టర్ గారూ... మావారికి ఏమైందో మీరే ఓసారి చూసి నయం చెయ్యాలి. మిమ్మల్నే నమ్ముకువచ్చాను." అని భోరు మంది భామ అని పిలవబడే సత్యభామ.**

**మిత్రుల చేత, బంధువుల చేత నమో అని పిలవబడే సదరు సత్యభామ భర్తగారు నళినీమోహనుడు... వెర్రిగా డాక్టర్ని చూస్తున్నాడు. తనలో తను ఏదో గొణుక్కుంటున్నాడు.**

**"ఏమైందమ్మా ఈయనకి?" అన్నాడు నమోని తేరిపార చూస్తూ డాక్టర్ పాంచజన్యం.**

"అది మీరే చెప్పాలి డాక్టరు గారు. అందుకేగా ఈయన్ని ఇక్కడికి తీసుకొస్తా!" అంది మళ్ళీ భామ.

"మీరేం చెప్పకపోతే నాకెలా తెలుస్తుందమ్మా! అలా తెలుసుకోగలిగేది ఒక్క పశువుల డాక్టరే. ఈయన్ని ఆయన దగ్గరకి తోలుకుపోండి... అదే తీసుకుపోండి! అన్నాడు పాంచజన్యం నవ్వుతూ.

"అబ్బా! మీ జోకులాపి ఈయన పిచ్చి ప్రవర్తనకు కారణం ఏమిటో ఆయన్నే అడిగి తెలుసుకుందురూ..." అంది భామ ఈసారి తానూ విసుక్కుంటూ.

మేటర్ సీరియస్ అయేలా ఉందని, అసలే ఆడవాళ్ళతో వ్యవహారం, జాగ్రత్తగా ఉండాలనుకుంటూ, స్టెత్ చెవిలో పెట్టుకుని మురళీ మనో హరుణ్ణి పరీక్షించబోయాడు పాంచజన్యం.

"ఆగండి! డాక్టర్‌గారూ!... మీరా స్టెత్‌ని అలా పట్టుకుంటే ఆయు క్షీణం... నాకు కాదు, మీకు!" ఈసారి నోరు విప్పాడు నమో.

అదిరిపడ్డాడు పాంచజన్యం.

"నేను స్టెత్ పట్టుకుంటే నాకు ఆయుక్షీణమా! ఏం మాట్లాడుతున్నారు, బుర్రలేకుండా!" అని కోపగించుకున్నాడు.

"అసలు మీరీ రూమ్‌లో కూర్చోవడమే సరిగా లేదు. మీకు ప్రాక్టీస్ బాగా ఉందా?" మళ్ళీ అడిగాడు డాక్టర్ని నమో.

ఈ ప్రశ్న డాక్టరుగారిని కొంత అయోమయంలో పడేసింది.

అవును నిజమే. ఈ మధ్య తన ప్రాక్టీస్ కాస్త మందగించింది... దాన్ని అంత గమనించలేదుగానీ... ఇప్పుడు ఈ నళినీమోహనుడు చెప్తుంటే... నిజమే అనిపించింది.

అయినా మేకపోతు గాంభీర్యంతో– "అబ్బే! అలాంటిదేమీ లేదే. అయినా మీకెందుకలా అనిపించింది?" అనడిగాడు, తనదగ్గరకొచ్చిన అతని ట్రీట్మెంట్ సంగతి పక్కన పెట్టి.

"నేను మీ క్లినిక్‌కి రాగానే, బయట మొబైల్ చూస్తూ కూర్చున్న మీ అటెండర్ కనీసం తలఎత్తి నేనెవరో అన్నది కూడా చూడకుండా... నన్ను వెంటనే లోపలికి పంపించేశాడు... మొన్నటిదాకా నేను కనీసం ఓ అరగంట అయినా వెయిట్ చేయాల్సి వచ్చేది. నా ముందు ఓ నాలుగురైనా పేషెంట్లుండేవారు!" అన్నాడు నమో.

"అదా!... అది నా ప్రాక్టీస్ మందగించడం కాదు గానీ, ఈ రోజు మంగళవారం. చాలా మంది పేషెంట్లు డాక్టర్లని కన్సల్ట్ చేయడానికి రారు. ప్రాణాలు పోయే ఎమర్జెన్సీ అయితే తప్ప! ఎవరూ సర్జరీకి కూడా ఒప్పుకోరు." అన్నాడు డాక్టర్, ప్రస్తుతానికి తన ప్రాక్టీస్ మందగించిందనే విషయానికి ఓ రోల్డ్ గోల్డ్ కవరింగ్ ఇస్తూ.

"అయితే నేను ఇవాళ మంగళవారం అయినా గానీ మీ దగ్గరకు వచ్చానంటే నాది ఏదైనా ప్రాణాంతకమైన వ్యాధా!?..." అన్నాడు నమో ఈసారి భయపడుతూ... డాక్టర్ని భార్యని మార్చి మార్చిచూస్తూ.

ఈ సంభాషణ అంతా విన్న... భార్యామణికి తల తిరిగినంత పనైంది.

"నేను దేనికి ఈయన్ని ఇక్కడికి తీసుకు వచ్చాను... ఇక్కడ వీళ్ళిద్దరిమధ్య జరుగుతున్నా ఈ సంభాషణ ఏమిటి?" అన్నది ఆమెకు అర్ధం కాలేదు.






ఇంక నాన్చడం వల్ల ఉపయోగం లేదనుకుని– “మీరిద్దరూ ఒకరికొకరు సరిపోయారు! అసలు విషయం అది కాదు, ఈరోజు మంగళవారం అన్నది నేను గమనించలేదుగానీ, మా వారికి రోజురోజుకీ మొబైల్ పైత్యం ఎక్కువైపోయింది. అందులో యూట్యూబులో వచ్చే విషయాలన్నీ తెగచూస్తూ మధ్యలో నన్ను పీక్కుతినేస్తున్నారు. ఆ మొబైల్ జాడ్యం ఎలాగైనా వదిలించాలి డాక్టర్ గారు” అన్నది సత్యభామ.

“నువ్వు మాత్రం యూట్యూబులు చూడ్డం లేదేమిటే! నన్నంటున్నావుగానీ ఆ యూట్యూబులో వంటల చిట్కాలు అన్నీ నా మీద ప్రయోగించడంలేదూ? ఆ మధ్య విరోచనాలు పట్టుకుని ఇక్కడికే కదా వచ్చాను...” భామ మీద విసుక్కున్నాడు నమో.

“చాల్లెండి! ఏం తిన్నా అరక్క... వెంట వెంటనే టాయ్‌లెట్‌లోకి పరిగెడుతూ...మళ్ళీ మందులకోసం యూట్యూబుల్లో వెతుక్కుని, ఎక్కడలేని అరకులూ, టాబ్లెట్లూ మింగుతూ, నన్నంటారేం మధ్యలో!”అంది భామ కోపంగా.

“అమ్మా! అయ్యా! ఆపండి. మీ భార్యాభర్తల గొడవలకు నా క్లినిక్కే దొరికిందా!... మరీ డాక్టర్నన్న మర్యాదకూడా లేకుండా నా ముందే కీచులాడుకుంటున్నారు” అని అరిచాడు డాక్టర్ పాంచజన్యం.

“సారీ డాక్టర్! అసలు ఆ యూట్యూబులో “ఇది తింటే మీరు ఢమాల్!... ఇలా చేస్తే మీ జీవితం చంక నాకిపోయినట్టే!... ఇది తింటే అనారోగ్యం మీ దరిదాపులకు రాదు!... మంగళవారం, ఆదివారం ఇలా చేశారో మీకు పట్టే దరిద్రం చచ్చినావదలదు!... ఇది తెచ్చి బీరువాలో పెట్టుకుంటే మీకు సిరి దరిద్రంలా పట్టుకు వదలనే వదలదు!”... ఇలాంటి పిచ్చి హెడ్డింగ్స్‌తో ఉన్న వీడియోలు చూస్తూ అవి పాటిస్తూ నా ప్రాణాలు తోడేస్తున్నారు. నాకు తెలీకఅడుగుతాను... “సిరి దరిద్రంలా పట్టుకోవడమేమిటండీ! వెధవ పోలికలు కాకపోతే!... సరే! అదలా ఉంచండి! ఆ యూట్యూబులో చెప్పిన పిచ్చి మొక్కలు పీక్కొచ్చి, చెత్త చెదారం ఏరుకొచ్చి, ఏవేవో ప్రయోగాలు చేసి ఇల్లు చిందరవందర చేసేస్తున్నారు. మీరే ఏదో కౌన్సెలింగ్ ఇచ్చి ఈయన్ని మామూలు మనిషిని చేయండి ప్లీజ్!” అంది సత్యభామ అసలు విషయాన్ని ఇంకాస్త వివరిస్తూ.

పాంచజన్యం ఏదో చెప్పబోయేలోగా, ఆ కన్సల్టెన్సీ రూమ్‌కి అటువేపున్న తలుపు తోసుకుని... ఆయనగారి భార్యామణి త్రిపురాంబ దూసుకువచ్చింది, ఇరాన్ మీదకి దూసుకు వచ్చిన అమెరికా మిస్సైల్‌లా.

“ఏమండీ! ఈ వీడియో చూడండి!... ఇలా మీరూ చేస్తే మీ ప్రాక్టీస్ మూడుకేసులు, ఆరు సర్జరీలునూ. ఈ ఇల్లు మొత్తం అమ్మేసో, రీమోడలింగ్ చేసేసో ఇందులో ఉన్నట్టు కట్టించేయండి. ఇప్పటికే మూడుసార్లు డింకీలు కొట్టిన మన పెద్దాడు కూడా పరీక్ష మంచి రాంకుతో పాసైపోతాడు!...” అంటూ అక్కడ ఎవరున్నారో కూడా చూడకుండా పాంచజన్యంని ఉక్కిరిబిక్కిరి చేసింది.

దాంతో సత్యభామకి విషయం అర్థమై... భర్తని బయల్దేరదీసింది... డాక్టర్, భార్య దాడి నుండి తేరుకునేలోగానే.






పొన్నాడ సత్యప్రకాశరావు
90006 19267

**సినిమా సామాన్యుడికి అందుబాటులో వున్న ఏకైక వినోద సాధనం. వినోదం విషయంలో భారతదేశంలో దీనికి ప్రత్యామ్నాయం లేదు. సగటు తెలుగు ప్రేక్షకుడికి సినిమా కేవలం ఒక వినోదం మాత్రమే కాదు... అది ఒక సంస్కతి... ఒక పండుగ... ఒక అనుభవం...ఒక భావోద్వేగం!**

**కొత్త సినిమా విడుదల అయితే చాలు భారీ కటౌట్లు, పాలాభిషేకాలు, తెల్లవారుఝాము ఆటలు, విజిల్స్ గోల గోలతో సినిమాతో మమేకం చెందుతాడు సగటు ప్రేక్షకుడు.**

**ఇండియాలో ఏటా సుమారు ఇరవై భాషలలో వందలాది సినిమాలు నిర్మించబడుతున్నాయి. అన్ని చోట్ల అభిమానులున్నారు... కానీ ఆ అభిమానులలో తెలుగు వీరాభిమాని వేరయా అని చెప్పాలి. పచ్చిగా చెప్పాలంటే సగటు తెలుగోడికున్న సినిమా పిచ్చి మరెవ్వరికీ లేదు.**

తెలుగు వాళ్ళమీద అంతటి ప్రభావాన్ని చూపిస్తున్న సినిమా తెలుగు జీవనాన్ని ప్రతిబింబించదా అంటే చూపిస్తోందనే చెప్పాలి. ఒకింత 'అతి' వున్నా నేడు 'అతి'గా అనిపించింది రేపటికి మాములై పోతోంది. కాల ప్రవాహంలో జన జీవన స్రవంతిలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటు చేసుకొంటున్నాయి. మార్పు సహజ పరిణామమే అయినా... అది ఎటువైపుకి దారితీస్తోంది అనేది గమనించవలసిన విషయం.

సమాజంలో సాంకేతికత విషయంలో అనూహ్యమైన పురోగతి గోచరిస్తున్నా మానవ సంబంధాలు, మానవీయ విలువలు విషయంలో తిరోగతే కాన వస్తోంది... వీటికి సినిమా మినహాయింపు కాదు అది కూడా కాలానుగుణంగానే తయారవుతొంది. సంఘంలో వలెనె సినిమాల్లోను విలువలు పడిపోతున్నాయి. వలువలు తగ్గిపోతున్నాయి. ఇక్కడ నిందించవలసినది సినిమాలను కాదు...సమాజాన్నె! సమాజంలో మంచి మరుగవుతున్నట్లే సినిమాలలోనూ మంచి సినిమాలు తగ్గిపోయాయి'

"కథా బలం లేని సినిమాలు వస్తున్నాయి..."

"హావభావాలు లేవు, మంచి వాచకం లేదు!"

"సాహిత్యం మంట గలసి పోయింది".

"హింస, అసభ్యత, అశ్లీలత పెట్రేగి పోతున్నాయి."

"కుటుంబంతో కలసి చూసే సినిమాలు రావటం లేదు."

"చక్కటి హాస్యం కరువవుతోంది, అంతా వెకిలితనం!" ...

ఇవి సాధారణంగా నేటి సినిమాలపై వినవస్తున్న వ్యాఖ్యలు.

"పాతది అంతా మంచే కొత్తది అంతా రోత" అనే పక్షపాత ధోరణిని కాస్త పక్కన బెట్టి సునిశితంగా చూస్తే...

పైన పేర్కొన్న ఆరు వ్యాఖ్యలలో మొదటి అయిదూ చాలా మటుకు నిజాలే. కాని ఆరవ వ్యాఖ్య సత్య దూరం. సత్య దూరం కాకపోయినా కొంత సవరణకు ఆస్కారముంది. అంటే ఆ వ్యాఖ్యలో కనబరచినంతగా



నేటి హాస్యం దిగజారలేదు. విలువలు అంతగా పడిపోని సినిమా అంశం ఏదైనా వుంది అంటే అది హాస్యరసమనే చెప్పాలి. నిజం!

పాత చిత్రాలలో '1950 –1980' మంచి హాస్యం వుండేది. మంచి నటులు వుండేవారు కానీ ఎనభైల తరువాత 'హాస్యరసం' ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. సినిమాలో ప్రధాన కథలో భాగంగా హాస్యసన్నివేశాలుండటం కాదు... హాస్యమే ప్రధానంగా సరదా సినిమాలు తీయసాగారు. హాస్య నటులవే ప్రధాన పాత్రలు. వారే కథానాయకులు కూడా! చాలా మంది హాస్య చిత్ర దర్శకులయ్యారు. హాస్య రచయితలూ సరే సరి.

గతంలో ఒక సమయంలో ఒక కాల వ్యవధిలో ప్రధానంగా ఒకరిద్దరు హాస్యనటులు... వారితో బాటు మరో ఇద్దరు ముగ్గురు హాస్య నటులు ఉండేవారు. ఉదాహరణకి రేలంగి, రమణారెడ్డిల కాలంలో... వీరితో బాటు అల్లు రామలింగయ్య, చదలవాడ కుటుంబరావు, వంగరవెంకట సుబ్బయ్య వంటి వాళ్ళు వుండే వారు. తరువాత కాలంలో రాజబాబు, పద్మనాభంల కాలంలో వెనుక అల్లురామలింగయ్య, చలం, కె.వి.చలం, పొట్టి ప్రసాద్ వంటి వాళ్ళు వుండేవాళ్ళు. ఆ విధంగా ఒక కాలవ్యవధిలో ఓ ఐదారుగురు హాస్య నటులుండేవారు.


కస్తూరి శివరావు

చలం హాస్య పాత్రల్లోనే కాకుండా కథానాయకుడిగా కూడా విజయం సాధించారు,. అలాగే చంద్రమోహన్, రాజేంద్రప్రసాదులు హాస్య చిత్ర కథానాయకులుగా విరాజిల్లుతున్న సమయంలో నూతన ప్రసాద్, సుత్తివేలు, వీరభద్రరావు, బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు, బాబుమోహన్ మొదలగు వారు కీలకమైన హాస్యాన్ని పండించారు.

2000 సంవత్సరం తరువాత హాస్య నటుల సంఖ్య గణనీయంగా పెరగసాగింది. ప్రస్తుతం తెలుగు చిత్రాలలో చురుకుగా నటించిన హాస్య నటులు నలభైమంది వరకు వున్నారంటే హాస్య రసానికి ఎంత పెద్ద పీట వేసారో అర్థం చేసుకోవచ్చు. ఇంతమంది హాస్య నటీనటులు మరే ఇతర భాషల్లోనూ లేరు.

ఇది తెలుగు హాస్య చిత్ర రంగ ఘనత!

ఇది సాధించటానికి తెలుగు చిత్రం తొలి నాళ్ళ నుంచి ఎంతో రూపాంతరం చెందింది.

1932లో వచ్చిన భక్త ప్రహ్లాద తెలుగు తొలి టాకీ. అప్పటి నుంచి అన్ని భక్తి చిత్రాలే... ఓ ఆరేళ్ళ తరువాత నుంచి మాలపిల్ల, సుమంగళి, రైతుబిడ్డ వంటి సమస్యాత్మక సాంఘిక చిత్రాలు వచ్చాయి.

తరువాత జానపద చిత్రాలు రాసాగాయి. జానపదం అనగానే మాయలు,మంత్రాలూ చిత్ర విచిత్ర వేషాలు... ఇదిగో సరిగ్గా ఇక్కడే భక్తి చిత్రాలతో సమస్యాత్మక చిత్రాలతో బుర్ర వేడెక్కిన ప్రేక్షకుడిని నవ్వించడానికి... హాస్య పాత్రల రూపకల్పన జరిగింది. సాధారణంగా హాస్య నటుడు రాజకుమారుడి చెలికాడు గానో ప్రతి నాయకుడికి అనుచరుడిగానో వుంటూ నవ్వులు పూయించేవాడు.

ఆ క్రమంలో 'స్టార్‌డం' అందుకున్న తొలి హాస్యనటుడు అందరు అనుకొనేటట్లు రేలంగి వెంకట్రామయ్య గారు కాదు!...
కస్తూరి శివరావు గారు.
(అయిపోలేదు.ఇప్పుడేగా మొదలైంది...)

**సొంతం** చిత్రంలో ఓ హాస్య సన్నివేశంకు కామిక్ రూపం!





# స్మైల్ స్టార్స్

## లేపాక్షి

మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక!

29

హాసెల్ఫీ

**1978** నుంచి కార్టూన్లు వేస్తున్నా... అన్నీ అని చెప్పలేనుగానీ ప్రముఖ పత్రికలన్నిట్లోనూ కార్టున్లు ప్రచురింపబడ్డాయి. మొదట్లో పేపర్ పై పెన్సిల్‌తో స్కెచ్ వేసి ఇండియన్ ఇంకుతో బొమ్మలువేసి వాటిని వాటర్ కలర్స్‌తో నింపేవాడిని. అప్పుడు ఒక కార్టూన్ వెయ్యాలంటే రెండు మూడు గంటలు కూడా పట్టేది. ఇప్పుడు దర్జాగా ఆ పనులన్నీ ఐప్యాడ్‌లో ప్రోక్రియేట్ యాప్‌లో గీసేస్తున్నా. పది నిమిషాల్లో కార్టూన్ వేసేయొచ్చు... లేదా అరగంట.

ఓ పదిహేను వేల పైనే కార్టూన్లేసుంటానేమో... వాటికి లెక్కుండదు కదా! బాగా కార్టూన్లేసే అందరూ నాకు గురువులే. సెర్జియోఅరగోన్స్ కార్టూన్లంటే చాలా ఇష్టం. బాపుగారి బొమ్మలు, కార్టూన్లు, చంద్రగారి అక్షరాలు, బొమ్మలు అంటే చాలా చాలా ఇష్టం.

మా తండ్రిపేరు ఓబుళ రెడ్డి, తల్లి సరోజమ్మ, అనంతపురం జిల్లా కదిరి తాలూకా నుంచి 1986లో హైదరాబాద్ వచ్చాను. తొలి ఉద్యోగం జ్యోతి మాస పత్రికలో. అందులో మూడేళ్ళు, ఉదయంలో 9ఏళ్ళు, పాత ఆంధ్ర జ్యోతిలో రెండేళ్లు, కొత్త ఆంధ్రజ్యోతిలో నాలుగేళ్ళు చేసి చివరగా సాక్షిలో పద్నాలుగేళ్లు డిప్యూటీ ఆర్ట్ డైరెక్టర్‌గా 2020లో రిటైర్ అయ్యాను.

నేను కొంతకాలం డాట్ డిజైన్ పేరుతో డిజైన్ స్టూడియో నడిపాను. అపుడు ఎన్నో బ్రోచర్లు పాంప్లేట్లు చాలా బుక్ కవర్లు చేశాను. మాటీవీ కొత్తగా మొదలైనపుడు దానికి సంబంధించిన లోగో దగ్గరనుంచీ పబ్లిసిటీ మెటీరియల్ మొత్తం నేనొక్కడినే చేశా. అది నాకు అతిపెద్ద ప్రాజెక్ట్.

అదృష్టవశాత్తు నా కార్టూన్లు చాలామందికి నచ్చుతున్నాయనడానికి నిదర్శనంగా ఫేస్‌బుక్‌లో నా ఫాలోయర్స్ ఇంచు మించు 30,000 ఉన్నారు. అవార్డులయితే చాలానే వచ్చాయిగానీ బాపూ రమణ అవార్డు తప్ప మిగతావి చెప్పుకోదగ్గవేం నాకు రాలేదు. నేను పోటీల్లో ఎక్కువగా పార్టిసిపేట్ చేయను కూడా. నేనెప్పుడూ హ్యూమర్ బేస్డ్ కార్టూన్లే వేస్తా. అవి అవార్డులకంత నప్పవు. 'కార్టూన్లలో అవార్డు కార్టూన్లు వేరయా' అనిపిస్తుంది.

ఇపుడు కార్టూనిస్టులు కొత్తగా తయారవుతున్నారన్నా, ఉన్నవాళ్లు ఉత్సాహంగా కార్టూన్లు వేస్తున్నారన్నా హాస్యానందం తప్ప మరో పత్రికలేదు. హాస్యానందం లేకపోతే మన కార్టూన్లు రీడర్స్‌కు చేరడానికి సోషల్ మీడియా ఒక్కటే గతి.













మాట మాట్లాడితే చాలు


మావారు ఆర్టిస్టు.. నాకు
రోజుకొక డిజైన్ వేస్తారు


మన బాస్ శాడిజం రోజురోజుకూ పెరిగిపోతోందండీ..
FOOT PRINT BIO METRIC
CLICK


తొందరగా రావయ్యా సామీ...
రాజుగారు యుద్ధానికెళ్ళాలి


వస్తావిన్నా...
మావారొచ్చే
టైమవుతోంది!!
లాంగ్‌జంప్


రే ఎంకటేసూ.. నామాటవిని
భవబంధాల్ని తెంచుకుని
వచ్చేయరా.. ఈ లైఫ్
పిచ్చ వేస్ట్‌గా ఉంది


రాత్రి ఒక కూలీ స్వర్గస్థుడయ్యాడు
అని రాశావు.. గొప్పోళ్ళకే స్వర్గస్థులనాలి..
చనిపోయాడని మార్చుపో..


ప్రతీరోజూ రావడం పొగడ్డం.. మెళ్ళోని గొలుసు
తీసి ఈయన విసరడం.. రాజుని అడుక్కుతినే
స్థితికి తెచ్చేవరకూ వీళ్ళు వదిలేట్టులేరు....!!



# అదీ తేడా!

వందన శ్రీనివాస్, 9989198970

ఏభైయ్యేళ్లు పైబడ్డ ఒక సగటుమనిషి విషయంలో తనకెవ్వరులేకున్నా, తననెంతమందికాదన్నా... నీతో నీ వెంట నేనున్నాను మిత్రమా అని ధైర్యం చెప్పి, దైనందిన జీవితంలో తనని బలవంతంగానైనా ముందుకు నడిపించే 'బీపీ (బ్లడ్ ప్రెజర్)' అనే అదృశ్య మహమ్మారి చాలా కాలంగా నన్ను కూడా ఆదరిస్తూ... నన్నూ నా ఒంటపట్టుకొని వదలక ముందుకు నడిపిస్తోన్న కారణంగా ప్రతి ఉదయం నేను అల్పాహారం తీసుకున్న వెంటనే కృతజ్ఞతాపూర్వకంగా ఆ మహమ్మారిని ఓసారి భక్తిపూర్వకంగా స్మరించుకుంటూ... తనకి నైవేద్యంగా ఓ ట్యాబ్లెట్ నా నోట వేసుకొని... తీర్థంలా ఓ గ్లాసుడు మంచినీరు కూడా నా గొంతుద్వారా తనకి పోయడం నా దినచర్యలో ఒక ముఖ్యమైన భాగం అయిపోయింది !

అలా అలవాటుగా ఆరోజు ఉదయంకూడా అల్పాహారం తిన్న వెంటనే టాబ్లెట్ వేసుకోడానికి ఉపక్రమిస్తుంటే అప్పుడు నాకు గుర్తొచ్చింది.. సదరు బీపీ టాబ్లెట్స్ నిన్ననే అయిపోయిన సంగతి!

ఇలాంటి సందర్భాలలోనే నాలాగే బీపీ పేషెంట్ అయిన నా ఒకానొక మిత్రుడి మాటలు నాకు వెంటనే గుర్తొస్తుంటాయి.

'బీపీ చాలా డేంజరస్ రా బాబు... మనమే మాత్రం ఏమరపాటుగా వున్నా... అది మనల్ని దొంగదెబ్బ తీస్తుంది! టాబ్లెట్ వేసుకోడం పొరపాటున కూడా మరచిపోకూడదు.' అని.

ఇహ చేసేదిలేక తప్పదన్నట్టు అంతవరకు లుంగీ, బనియానులో రిలాక్స్‌డ్‌గా వున్న నేను ఫ్యాంటూ, షర్టూ వేసుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ భారంగా మా వీధి చివర్న హైవే పైనున్న అపోలో మెడికల్ షాప్ కి బయలుదేరాను... టాబ్లెట్స్ కొని తెచ్చుకుందామని.

నా బద్ధకాన్ని ప్రోత్సహిస్తూ ఇంటికి దగ్గర్లోనే ఆ మెడికల్ షాప్ వుండడం మూలంగా తరచూ నేనక్కడే మందులు కొనడం నాకలవాటైపోయింది.

నేను మెడికల్ షాప్‌కి చేరుకొని చూసేసరికి అక్కడ ఆ షాపు కస్టమరు పేషెంట్ దేవుళ్లతో కళకళలాడుతూ బిజీబిజీగా వుంది.

షాపులో పనిచేసే రాజు అనే కుర్రాడు నాకు బాగా పరిచయం వున్నవాడు కావడంతో అంత బిజీలోనూ దూరంగా కనిపించిన నన్ను చూసి 'కాస్సేపు వెయిట్ చెయ్యండి సర్ ప్లీజ్' అన్నట్టుగా చిన్న నవ్వు నవ్వాడు.

ఇక చేసేదిలేక నిల్చున్నచోటనే నిల్చుని...రోడ్డునపోయే మనుషుల్ని, వాహనాల్ని పరిశీలించసాగాను. అలా ఓ ఇరవై నిముషాలు గడిచాక, అంతవరకు ఓపిగ్గా నిల్చుని వెయిట్ చేస్తోన్న నన్ను తన బిజీ అంతా తగ్గిన తరువాత...

"రండి సార్ రండి! పాపం మిమ్మల్ని చాలాసేపు నిలబెట్టేసాను.. ఏమనుకోకండి!" అంటూ పిలిచాడు రాజు... నా టాబ్లెట్స్ ఏమిటో తనకి ముందే తెలుసుకాబట్టి తీసి రెడీగా తన చేతబట్టుకుని.

షాప్ మెట్టెక్కి, థాంక్స్ బాబూ రక్షించావంటూ టాబ్లెట్స్ అందుకుని అక్కడేవున్న స్కానర్ వైపు చూస్తూ నేను ఫోన్‌పే చేస్తూ వుంటే...

షాపు కుర్రాడు రాజు ఒక సందేహం వెలిబుచ్చాడు ఇలా...

"అవున్సార్ నాకు తెలియక అడుగుతాను, ఈ టాబ్లెట్ ఒకట్రెండ్రోజులు మీరు వేసుకోకపోతే ఏమౌద్దట?... అంత తేడా కనిపిస్తుందా మీ బాడీలో మీకు?" అంటూ.

పేమెంట్ చెయ్యడం పూర్తయ్యాక వీడికిలా క్కాదు... సమాధానం మంచిగా, బాగా తనకి అర్థమయ్యేట్టు చెప్పాలని మనసులో అనుకుని నవ్వుకుంటూ....



'ఓ అదా నీ డౌటు... సరే చెప్తాను విను' అంటూ ఇలా చెప్పడం మొదలుపెట్టాను నేను..

ట్యాబ్లెట్ రెగ్యులర్‌గా వేసుకున్నాననుకో... 'ఈ వయసులో కూడా నువ్వింతసేపు నన్ను నిలబెట్టి నందుకు నేను ఓపిగ్గా వెయిట్ చేసి 'పోన్లే పాపం కుర్రాడు ఇంత చిన్న వయసులో కూడా కష్టపడు తున్నాడు... ఇంట్లో ఏ ప్రాబ్లెమ్స్ వున్నాయో ఏమో... కాస్సేపు వెయిట్ చేస్తే పోలా' అని అర్థం చేసుకుంటా నన్ను మాట...

అదే నేను రెగ్యులర్‌గా ఈ ట్యాబ్లెట్స్ వేసుకో లేదనుకో...'అరే నీ మైండ్ ఏమన్నా చితికిందా? అసలది పనిచేస్తుందా? నీకసలు కామన్ సెన్స్ ఏ మాత్రమైనా వుందా!? నేనిక్కడ గంటల తరబడి నిల్చుని వెయిట్ చేస్తూంటే నీ కళ్లు మూసుకుపోయాయట్రా?... మసకబారా యట్రా?... అరే నావెనకాల వచ్చిన వారికి నువ్వు అంత మంచిగా సర్వీస్ చేస్తూ మెడిసిన్స్ అవీ ఇవీ అన్నీ ఇస్తున్నావుగాని నన్నుమాత్రం పట్టించుకోవేం!? నీకసలు బుద్ధుందట్రా... ఎవడను కుంటున్నావురా నన్ను!... నేనుగాని తలచుకుంటే నీ షాపుని నిముషాల్లో సీజ్ చేయిస్తాను ఏమనుకుంటున్నావో ఏమో... ఇందాకటినుంచి చూస్తున్నా... కస్టమర్ అంటే నీకింత అలుసా!?... అదీ చూస్తా...."అంటూ ఇలా చెప్పుకుపోతూ రంకెలేస్తూన్న నన్ను చూసి....



"ఆపండి మహాప్రభో! ఆపండి!!... అర్థమయ్యింది టాబ్లెట్ వేసుకో డానికీ వేసుకోకపోవడానికీ తేడా ఏమిటో... దయచేసి నన్ను క్షమిం చండి!... మరోసారి ఈ డౌట్ ఎవ్వరినీ అడగను!" అంటూ షాప్ కుర్రాడు రాజు బెంబేలెత్తిపోవడం చూసి నేను నవ్వుతూ...

"సారీ రాజూ! నాలాంటి బీపీ పేషెంట్ల బాధ ఎలా వుంటుందో నీకు బాగా తెలియాలని ఇలా చెప్పానంతే... నన్ను తప్పుగా అర్థం చేసుకోకేం!" అంటూ చెప్తూంటే...

అప్పటిగ్గాని వాడి ముఖంలో మునుపటి నవ్వు చూడగలిగిన నేను వెనుదిరిగాను...

నాలో నేను కూడా నవ్వుకుంటూ.






గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969



# అవార్డ్ ఫర్ సేల్ ...

**రిసెప్షనిస్ట్ వచ్చి... "పిల్లబాబుగారూ! మిమ్మల్ని జలగారావ్‌గారు పిలుస్తున్నారు లోపలికి వెళ్ళండి!" అంది.**

**పళ్ళని బయటపెడుతూ లోనికి వెళ్ళి... "నేను, ప్రఖ్యాత ప్రముఖ రచయిత పిల్లబాబుని... మీ అవార్డుకి ఎంపికయ్యానని ఓసారి రమ్మంటేనూ ఇలా వచ్చాను!" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.**

"కంగ్రాట్స్ సార్! మేం సన్మానం చేయడానికి ఎంపిక చేసిన ఇరవై మంది రచయితలలో మీరు కూడా ఉన్నారు!" చెప్పాడు నవ్వుతూ.

"ఛ!ఛ! ఇరవైమందిలో ఒకడిగానా... ఉత్తమ రచయితగా కాదా?" అడిగాడు ఆవదం మొహంతో.

"నెల నుండీ పోరితే మీరిప్పుడొచ్చారు. ఆ కేటగిరి అవార్డు ఎప్పుడో అమ్మేశాం!" అని నాలుక్కరుచుకుని... "అదే ఆ అవార్డుకి అర్హుడిని నిర్ణయించేశాం!" అన్నాడు.

"అలాగా!? ఇక ఇవి తప్ప వేరే ఏ అవార్డులు లేవా?..." అడిగాడు పిల్లబాబు అమాయకంగా

"లేవు సార్!... వచ్చే ఏడాదైనా తొందరగా స్పందించి డబ్బు..." అని మళ్ళీ నాలుక్కరుచుకుని..."అదే ముందుగా స్పందిస్తే చూద్దాం!" అన్నాడు.

"ఓ యాభైవేలు ఇస్తాను మరో మంచి కేటగిరీ చూడండి. సన్మానం అయ్యాక కూడా సభా వేదిక మీద కూర్చోవాలి!" అన్నాడు.

దాంతో జలగారావ్ కాస్త కళ్ళజోడు సరిచేసుకుని... "మీరు మరీ మొహమాట పెట్టేస్తున్నారు. ఉండండి ఎవరెవరికి ఏ అవార్డులు అమ్మే ఎంపిక చేసామో చూస్తాను!" అని...

"ఈ ఏడు ఉత్తమ రచయిత రంపంబాబు!" అని చెప్పగానే...

"అతను ఎప్పుడో వయసులో ఉన్నప్పుడు కొన్ని కథలు వ్రాశాడు. ఇప్పుడు ఆయనికి డెబ్బై ఏళ్ళు. ఇప్పుడు ఆయన ఉత్తమ రచయిత ఏవిటండీ నా బొంద! ఒట్టి ఉత్త రచయిత అయితేనూ!" అన్నాడు.

"అలా అనకండి! ఆయన కొన్ని సినిమాలకి వ్రాశాడు. పైగా వ్రాసినవి కొన్ని కథలే అయినా... సన్మానానికి మాకు లక్షలు ఇచ్చారు!" అని నాలుక్కరుచుకుని... "అదే లక్షణమైన కథలు రాశారు!"

ఏవేవో కంప్యూటర్లోనూ, ఓ పెద్ద పుస్తకంలోనూ చూసి... "అబ్బే ఏ అవార్డులూ ఖాళీలేవు సార్! అందరితో కలిపి చేసే సన్మానం ఉంది. ఓ ఇరవై వేలు ఇచ్చి చేయించుకోండి. బ్రహ్మాండంగా ఉంటుంది...కాదూ కూడదూ అంటే ఉత్తమ సమీక్షకుడి అవార్డు మాత్రమే ఉంది!"

"పోనీలే... గుడ్డిలో మెల్ల. ఉత్తమ కవి అవార్డు ఉందా?!...నావి రెండు కవితా సంపుటాలు ఉన్నాయి. ఒకటి అడవి వేయించిన వెన్నెల, రెండు పెద్దనగ్రోవి!" చెప్పాడు.

"అదేవిటీ వింతగా?" అన్నాడు జలగారావ్ బుర్ర గోక్కుంటూ.

"రొటీన్‌కి భిన్నంగా, అందరూ అడవి కాచిన అంటారని అడవి వేయించిన అని పెట్టాను. పిల్లనగ్రోవి ఎందుకని పెద్దన గ్రోవని పెట్టాను." చెప్పాడు గర్వంగా.

"ఏడిసినట్టుంది! అడవి కాచిన అంటే... ఏ టీయో కాఫీ కాయడమో అనుకుని, దానికి పోటీగా వేయించిన అని పెట్టినట్టున్నారు."











అని పుస్తకం చూసి... "కవి అవార్డు కూడా అయిపోయింది. కావాలంటే ఈ సంవత్సరానికి ఉత్తమ సమీక్షకుడి అవార్డుంది. అది తీస్కోండి" అన్నాడు.

"నేను రచయితని. సమీక్షకుడి అవార్డు ఎలా తీసుకుంటాను... కథలే అంతంత మాత్రం రాసాను. పైగా నేను ఒక్కటంటే ఒక్క కథకి కూడా సమీక్ష చేసి ఏడవలేదు... మరి ఇది ఎలా?" అంటూ నసిగాడు.

"అదా మీ భయం! మీ పేరు పిల్లబాబు కదా?..ఇటు చూడండి!" అంటూ లాప్‌టాప్‌లో పిల్లబాబు పేరుతో ఉన్న రెండు సమీక్ష పుస్తకాలని పిల్లబాబుకి చూపించాడు జలగారావ్.

అవి చూస్తూనే "మీ వెబ్‌సైట్లో నా పేరు మీద రెండు సమీక్ష పుస్తకాలు భలే అందంగా ఉన్నాయ్. కానీ ఇవి ఎలా వచ్చాయ్?..." అడిగాడు అయోమయంగా.

"అదే మా ప్రత్యేకత! ముందుగానే ఇలాంటి కథాసంపుటాలు, నవలలు, కవితలూ, సమీక్షలూ ఎవరెవరితోనో రాయించి... డిటిపి చేయించి రెడీగా పెట్టుకుంటాం... అవార్డు ఎవరు 'పుచ్చు'కుంటారో వారి పేరు వ్రాసేసి కొద్ది నెలల ముందే... వారి పేరు మీద కథలు, కవితలు, సమీక్షలు అన్నీ మా వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో పెట్టి ఊదరగొడతాం."

"బావుంది కానీ నేను రచయితను కదా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు పిల్లబాబు.

"ఆ విషయంలో మరీ వర్రీ అయిపోకండి. మన సభలో మిమ్మల్ని రచయితగానే పరిచయం చేస్తాం... అలానే రచయితగా మీ గురించి ఉన్నవీ లేనివీ... మా యాంకర్‌తో పొగిడించి పెడతాం!" అన్నాడు.

తర్వాత కొద్ది రోజులకి సభకి వెళ్ళి సన్మానం అందుకున్న పిల్లబాబుని... ఆ సభలోని ఓ రచయిత, "మీ కథలు కొన్ని చదివాను.కానీ అన్నీ తల తోకా లేనివే... మొదలు ఉండదూ అంతం ఉండదూ... ఎందుకు చదివాన్రా దేవుడా అనిపిస్తుంది. ఓ మంచి రచయిత వద్ద శిక్షణ తీసుకోవచ్చుగా!..." అని ఇంకేదో అనేంతలో... "ఆయనకి సమీక్షకుడి అవార్డు ఇచ్చాం. కనుక ఆయన రచనలపై చర్చ అనవసరం." అన్న జలగారావ్ వంక మెచ్చుకోలుగా చూశాడు పిల్లబాబు.

"అలా అయితే దెయ్యాలదిబ్బ కథ సమీక్షలో ఆడ దెయ్యం పాత్ర గురించే ఎక్కువ సమీక్ష చేసి, ఆమె ప్రియుడు ప్రేతాత్మ గురించి పెద్దగా సమీక్ష చేయలేదెందుకని?"

"మరి, మరేమో ఏది ఎంతవరకు అవసరమో అంతవరకే చేయాలి. అందుకే అలా చేసాను." అన్నాడు, మరమరాలు మింగినట్టు తడబడిపోతూ.

"అయితే, వయసు ముసుగేసింది కథలో అసలు సమీక్ష ఎందుకు చేసారో అర్థం కాలేదు. కథనే మళ్ళీ అటు తిప్పి ఇటు తిప్పి వ్రాసినట్టనిపించింది."

"అది...మరీ... కథ పాఠకుడితో చదివించాలని అలా వ్రాసాను." అని పక్కనే కూర్చున్న జలగారావ్ తొడ గిల్లేసాడు.

"చాలండీ ఇక చాలు!...మిగతా వారికి అవకాశం ఇవ్వండి!" అన్నాడు.

"నేను కూడా పిల్లబాబుగారినే అడుగుతాను" అని మరో రచయిత నిలబడి...

"మీ కథల్లో ఉత్తమ, ప్రథమ పురుష పద్ధతులని కలిపి రాసేస్తుంటారు... ఎందుకని?" అడిగాడు.

ఆ ప్రశ్న విన్న పిల్లబాబు, 'అవార్డు కొనొచ్చు కానీ, అర్హత కొనగలమా? ఇంకెప్పుడూ అవార్డులు కొనకూడదు.' అని తనకి తానే తొడపాశం పెట్టుకుని, కప్పిన శాలువతో కళ్ళు తుడుచుకున్నాడు.

అది చూసి, ప్రశ్న వేసినతను– "మీ భావోద్వేగానికి కారణం?" అడిగాడు.

దాంతో ఇంకాస్త కోపంగా, మరో తొడకి కూడా తొడపాశం పెట్టుకుని... మరోసారి శాలువతో కళ్ళు తుడుచుకున్నాడు.




**హాస్యానందం పాఠకులకు సుపరిచితులు శ్రీ గంగాధర్ వడ్లమన్నాటిగారి హాస్య కథలపై –**
**గంగాధర్ వడ్లమన్నాటి హాస్య కథలు – పరిశీలన పేరుతో చేసిన పరిశోధనకు గాను, నెల్లి సంతోష్ కుమార్ డాక్టరేట్ పొందారు.**
**ఇరువురికి హాస్యానందం అభినందనలు.**




## హౌ టు మర్డర్ యువర్ వైఫ్ !

**ఆరోజే రిలీజ్ అయిన ‘అర్జున్ రెడ్డి’ సినిమాని మైదానం అనే సినీ డైరెక్టర్, ఆయన శిష్యుడు ఏకవీర చూసి థియేటర్ నుండి బయటికి వచ్చి... ఆ సినిమా గురించి ఇద్దరూ డిస్కస్ చేసుకుంటూ మైదానం ఇంటి వరకు వచ్చారు.**

**‘హౌ టు మర్డర్ యువర్ వైఫ్’ అనే ఇంగ్లీష్ సినిమా డీవీడి ఏకవీరకు మైదానం ఇస్తూ... “ఏకవీరా! నువ్వు రాసుకున్న కథకు ఇది రిఫరెన్స్‌గా పనికొస్తుంది... చూం మళ్ళీ నాకు జాగ్రత్త గా తెచ్చివ్వు!” అన్నాడు.**

అతి త్వరలో కాబోయే సినిమా డైరెక్టర్ ఏకవీర తన ఇంట్లోకి వచ్చి మైదానం ఇచ్చిన డీవీడీ ని చూడాలని ల్యాప్‌టాప్ ఆన్ చేశాడు.

ఇంతలో ఆయన భార్య గాయత్రి వచ్చి–

“ఏ సినిమా?” అని డౌట్‌గా అడిగింది.

తన భార్య మనస్తత్వం తెల్సిన ఏకవీర– “ఏదో ఇంగ్లీష్ సినిమాలే.” అని ఆ సినిమా టైటిల్ కనిపించకుండా డీవీడీని అటు తిప్పి పట్టుకున్నాడు.

“ఏదీ? నన్ను ఓసారి చూణ్ణీ!...” అని ఆ డీవీడీని ఏకవీర దగ్గరనుండి తీసుకోబోయింది.

ఏకవీర దాన్ని ఇవ్వకుండా– “ చెప్తున్నాగా! ఇంగ్లీష్ సినిమా అని.” గాయత్రి మీద చిరాకు పడ్డాడు.

అయినా గాయత్రి వినకుండా శక్తివంచన లేకుండా ఏకవీర మీద పడి ఆ డీవీడీని బలవంతంగా లాక్కోని ఆ సినిమా టైటిల్ చదివి,

“ఈ సినిమా చూడమని ఎవరిచ్చారు నీకీ డీవీడి!?” అని ఉక్రోషంగా అడిగింది.

“నా గురువు గారు డైరెక్టర్ శ్రీ మైదానం గారు! ఏం!?” కేజువల్‌గా అన్నాడు.

“వాడొక పెద్ద దొకట డైరెక్టర్!... అందుకే నీకీ సినిమా చూడమని ఇచ్చాడు.” అంది.




“నీకేమైనా పిచ్చా గాయత్రీ!... ఈ సినిమా చూస్తే తప్పేంటి?...” సౌమ్యం మిళితమైన కోపంతో అన్నాడు.

“మరి తప్పు కాదా? పర్వర్షన్ కాకపోతే ఈ టైటిలేంటి?” ప్రశ్నించింది గాయత్రి.

“ఆ కథకు యాప్ట్ కాబట్టి టైటిల్ అలా పెట్టారు. అయినా ఇది ఇంగ్లీష్ సినిమా. వాళ్ల టైటిల్స్ ఇలాగే పెడతారుగానీ ఆ డీవీడి ఇవ్వు.” అన్నాడు సాఫ్ట్‌గా ఏకవీర.

“నేను ఇవ్వను! ఇస్తే సినిమా చూస్తారు.”

“చూడకుండా శ్రీ మైదానం గారికి ఇచ్చేస్తా గానీ ఇవ్వు.”

ఇంతలో డైరెక్టర్ మైదానం కాల్ చేశాడు.

ఏకవీర ఫోన్ లిఫ్ట్ చేసి– “గురువు గారు! చెప్పండి.” అన్నాడు.

“డీవీడి ఓపెన్ అయిందా ఏకవీరా?” అని ఇంకేదో చెప్పబోతుండగా... ఏకవీర దగ్గర నుంచి గాయత్రి ఫోన్ లాక్కోని–

“ఎందుకయ్యా మా ఆయనకు చూడమని ఇలాంటి లత్తకోరు సినిమా ఇచ్చారు?... కావాలంటే మీరు చూసి మీ పెళ్ళాన్ని చంపుకోండి...అంతేగానీ ఇంకెప్పుడు ఇలాంటి గబ్బు సినిమాలు చూడమని మా ఆయనకు ఇవ్వకండి...”అని ఇంకా ఏమో అనబోతుండగా...

గాయత్రి చేతిలోని తన మొబైల్‌ను ఏకవీర లాక్కొని కాల్ కట్ చేసి–“ఏయ్ చుడేల్! నీకేమైనా మెంటలా? మైదానం గారంటే ఎవరను కున్నావ్? ఆ పెద్దాయనతో ఇలాగేనా మాట్లాడేది?” అన్నాడు ఏకవీర.

“ఏంటీ ఆయనగారి గొప్ప?...” హేళనగా అంది.

“ ఆయన తీసిన సినిమాలన్నీ కళాఖండాలే తెలుసా?” గర్వంగా అన్నాడు.

“ఔను! అన్నీ కళాఖండాలే! ఆయన గారు తీసిన ఒక్క సినిమా అయినా మూడు రోజులు ఆడి చచ్చిందా?... అతగాడు తీసిన సినిమాల గురించి రివ్యూల్లో ఏం రాస్తారో ఎప్పుడైనా చదివావా?ఎవరికైనా జీవితం మీద విరక్తి పుట్టి చావాలనుకుంటే ఆ మైదానం తీసిన సినిమాలు చూడాలంటారు... తెలుసా?” అని సర్కాస్టిక్కాగా అంది.

“రివ్యూలు రాసేవాళ్లు అలాగే రాస్తారు. ఏదీ, ఆ పోటుగాళ్ళను ఒక సినిమా తీయమను. అప్పుడు తెలుస్తుంది అందులో ఉన్న కష్టమేంటో!” అన్నాడు ఆవేశంగా.

“పోయిన ఆదివారం మనం తిన్న రెస్టారెంట్‌లో బిర్యాని బాగాలేదని ఆ హోటల్ వాళ్ల మీద ఎందుకు కోప్పడ్డారు?” క్వశ్చన్ చేసింది.

“మరి రెండొందలు తీసుకుంటూ అంత చెత్త బిర్యాని ఎలా పెడతారు?” సీరియస్‌గా అన్నాడు ఏకవీర.

“మరి నువ్వు అంతకంటే బాగా చేయ







గలవా?" అంది గాయత్రి.

"అది నా పని కాదు... తింటున్నందుకు డబ్బులిస్తున్నా. కాబట్టి బాగాలేకపోతే అడిగే హక్కు ఉంది." ధాటిగా అన్నాడు.

"సినిమా రివ్యూలు రాసేవాళ్లు అంతే! మీ మైదానం తీసే రొడ్డ కొట్టుడు సినిమాలు డబ్బు పెట్టి చూసినప్పుడు... వాళ్ళకు నచ్చకపోతే అలాగే రాసే హక్కు వుంటుంది." అంది.

"నీ ఎనాలసిస్ ఏడ్చినట్టే ఉంది గానీ... పోయి... ఆ ఏడుపుగొట్టు టీవీ సీరియల్స్ చూసుకోపో." అన్నాడు పరమ చిరాకుగా.

"ముందు నువ్వు ఆ మైదానం గాడితో తిరగడం మానుకో. లేకపోతే నువ్వు ఈ జన్మలో డైరెక్టర్‌వి కాలేవు." అని అంటుండగా ఏకవీర అనుకోకుండా తన చేతిలో ఉన్న ఫోన్ చూసుకుని కంగారుగా కాల్ కట్ చేసి...

"ఏయ్ దెయ్యమా! ఇందాక కన్ఫ్యూజ్‌లో ఫోన్ కట్ చేయలేదు... ఇంతసేపూ ఆన్‌లోనే ఉంది. నువ్వు అన్న మాటలన్నీ మా గురువు గారు వినేసి ఉంటారు." అన్నాడు.

"మంచి పని అయింది... ఇకనుంచైనా ఆ వేస్ట్‌ఫెలో నిన్ను దూరం పెడతాడు." అంది చీదరింపుగా.

"ఆయన గురించి ఏం తెలుసనీ అంత చులకనగా మాట్లాడుతున్నావ్? ఆయన తీసిన ప్రతి సినిమాలో మంచి 'జీనియస్ మెసేజ్' ఉంటుంది తెలుసా?"అన్నాడు జీర గొంతుతో.

"మెసేజీలు చెప్పించుకోడానికి ఎవరూ సినిమాలకు రారు. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వస్తారు...అయినా సినిమాలు తీసి నీతులు చెప్పడం కాదు. నిజ జీవితంలో ఆ మైదానం సన్నాసి కూడా సక్రమంగా ఉండాలిగా?" కోపంగా అంది.

"ఇదిగో గాయత్రి! డైరెక్టర్ మైదానం గారిని అంటే నన్నట్లే..."

"నువ్వూ అలాంటి వాడివైతే నిన్నూ ఇంత కంటే ఎక్కువే అంటాను." రౌద్రంగా అంది.

"సినిమా డైరెక్షన్ గురించి నీకు ఏం తెలుసనీ వాగుతున్నావు? నోర్మూసుకుని పోయి పక్కింటి ఆవిడతో నగలు, చీరల గురించి మాట్లాడుకోపో." అన్నాడు ఏకవీర కోపంతో.

"నా సంగతి పక్కన పెట్టు...మీ మైదానం గాడు తీసే సినిమాలకన్నా టీవీ సీరియల్స్ చాలా బావుంటాయి!" వ్యంగంగా అంది.

"సరే గాయత్రి! అలాగే అనుకో...నీతో నాకు ఆర్గ్యుమెంట్ ఎందుకుగానీ ఆ డీవీడి ఇవ్వు. ఆ సినిమా యూట్యూబ్‌లో గానీ పైరసీ సైట్లల్లో గానీ ఎక్కడా దొరకడం లేదు... అందుకే మైదానంగారి లైబ్రరీ కలెక్షన్ నుండి తీసి నాకు ఇచ్చారు." సంయమనం పాటిస్తూ అన్నాడు ఏకవీర.

"నో! ఇస్తే నువ్వు చూస్తావు.నేను చచ్చినా ఇవ్వను!"అంది గాయత్రి.

"నా సహనానికి పరీక్ష పెట్టకు గాయత్రి! మర్యాదగా ఆ డీవీడి ఇవ్వు." అన్నాడు ఏకవీర వస్తున్న కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ.



"అయినా నాకు తెలీక అడుగుతున్నా... నిన్నటి రోజు, పెళ్లాన్ని చంపి సూట్‌కేసులో పెట్టే 'మధ్యాహ్నం హత్య' అనే గలీజ్ సినిమా చూశావు. ఈ రోజు ఇది. ఎందుకు ఇలాంటి పాపిష్టి సినిమాలే చూస్తున్నావ్?..." అంది.

"నేను రాసుకున్న కథకు రిఫరెన్స్ కోసం ఇలాంటి సినిమాలే చూడాలి." నింపాదిగా అన్నాడు ఏకవీర.

"త్రివిక్రమ్, శేఖర్ కమ్ముల, నాగ్‌అశ్విన్... వీళ్లు తీసిన సినిమాలు చూడచ్చుగా?" సలహా పడేసింది గాయత్రి.

"నాకు వాళ్ల సినిమాలు నచ్చవు." అన్నాడు ఏకవీర ఎటో చూస్తూ.

"పెళ్లాన్ని చంపి... ఎలా తప్పించుకోవాలో చెప్పే సినిమాలు అయితే బాగా నచ్చుతాయి కదూ? కసిగా అంది గాయత్రి.

"సరే! నీలాంటి బ్రెయిన్ లేని దాంతో ఇంత సేపు మాట్లాడటం నాదే తప్పు గానీ, ఆ డీవీడి ఇచ్చి వెళ్ళు ఇక్కడ్నుంచి." నమ్రతగా అన్నాడు.

"ఈ డీవీడి నీకు ఇవ్వడం కుదరదు గానీ, నీకు బ్రెయిన్ ఉండి ఏం చేస్తున్నావ్? భూమి పుట్టక ముందు సినిమా ఫీల్డ్‌కు వచ్చావ్. ఇంత వరకు డైరెక్టర్ కాలేదు... నిన్న మొన్న వచ్చిన వాళ్లంతా డైరెక్టర్స్ అయిపోయి కోట్లు కోట్లు సంపాదిస్తుంటే... నువ్వు మాత్రం ఇలాంటి పిచ్చి పిచ్చి సినిమాలు చూసుకుంటూ ఎప్పుడూ కొంపలోనే పడుంటున్నావ్!..." అని ఇంకా ఏమో అనబోతుంటే...




"సినిమా ఫీల్డ్ గురించి నీలాంటి మట్టి బుర్రకు అర్థం కాదుగానీ, వెళ్లి ఏదైనా పని ఉంటే చేసుకోపో!" అన్నాడు నిస్సహాయంగా.

"ఔను మరి! నీలాంటి చేతగానీ సన్నాసిని చేసుకున్నందుకు జీవితాంతం ఇంటి పనులే చేసుకోవాలి. అంతా నా ఖర్మ!" అని అక్కడున్న చెంబుని విసిరేసింది.

"నేను సినిమా వాడ్ని అని తెలుసేగా పెళ్లి చేసుకున్నావ్? ఇప్పుడు నా మీద పడి ఏడుస్తావెందుకు గాయత్రి?" గట్టిగా కసిరాడు.

"సినిమా వాళ్లని పెళ్లి చేసుకోవద్దని... మా అమ్మా నాన్న నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పారు. నేనే అష్ట దరిద్రపుదాన్ని. వాళ్ళ మాట విని చావకుండా నిన్ను పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను..." అని కొనసాగిస్తూ...




"మా కరీంనగర్ మేనత్త చెప్పినట్టు పెద్దన్న వారిపల్లిలో వున్న మా కోటేశ్వర్‌రావు బావను పెళ్లి చేసుకుని ఉండుంటే... నా లైఫ్ ఎంతో బావుండేది." అని నిట్టూర్చింది.

"మరైతే ఇప్పుడే వెళ్లి ఆయనగారినే పెళ్లి చేసుకుని హ్యాపీగా ఉండు. నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు అసహనంగా.

"ఎందుకుంటుంది? ఏదో విధంగా నన్ను వదిలించుకోవాలని చూస్తున్నావ్. ఇంత చేత గాని వాడివి నన్ను పెళ్లెందుకు చేసుకున్నావ్!?" గద్దించింది.

"గాయత్రి!... బాగా ఫ్రస్టేషన్‌లో ఏం మాట్లాడుతున్నావో నీకు అర్థమౌతోందా?..." అన్నాడు కోపాన్ని అణచుకుంటూ.

"ఏంటి అర్థమయ్యేది? నీలాంటి బుర్రలేని వాళ్లంతా సినిమా ఫీల్డ్‌కు వచ్చి రాజమౌళి, పూరి జగన్నాథ్‌లు అయిపోదామనుకుంటారు. చివరికి ఏమీ కాలేక ఆ గణపతి కాంప్లెక్స్ దగ్గరో లేదా కృష్ణానగర్‌లోనో తిరుగుతూ వన్ బైటు టీలు తాగుతూ సొల్లు మాట్లాడుకుంటూ ఉంటారు." గాయత్రికి సినిమా ఫీల్డ్ మీద వున్న కోపాన్నంతా కక్కేసింది.

"సరే! ఇంకో ఆర్నెల్లలో నా డైరెక్షన్‌లో ఓ సినిమా స్టార్ట్ కాకపోతే అప్పుడు నువ్వు ఏమైనా అను! నేను పడుంటాను." అన్నాడు నచ్చజెప్పే ధోరణిలో.

"నీలాంటి వాళ్లకు ఇలాంటి ఛాలెంజ్‌లు సూటుకావు గానీ... ఇకనైనా ఈ సినిమా ఫీల్డ్ వదిలేయండి. మా ఊరు వెళ్ళి పోదాం... మా







కోటేశ్వరరావు బావ కాళ్ళు పట్టుకుని అక్కడ వాళ్ల రైస్ మిల్లులో నీకు ఏదైనా చిన్న ఉద్యోగం ఇవ్వమని అడుగుతాను." అంది చులకనగా.

"ఇదిగో గాయత్రి! ఈ గొడవ ఇంతటితో ఆపేద్దాం. ఇద్దరం ఇలా మాటా మాటా అను కుంటూ పోతే చివరికి ఏమైనా జరగచ్చు." హెచ్చరికగా అన్నాడు.

"ఏం జరుగుతుంది? నన్ను కొడతావా?... ఏదీ సిగ్గు, మానం, పౌరుషం వున్న మగాడివైతే నన్ను కొట్టురా చూద్దాం! " అని రెచ్చకొట్టింది.

"నిన్ను కొట్టాల్సిన అవసరం నాకు లేదు గానీ, ఆ డీవీడి ఇవ్వు. ఇప్పుడే వెళ్ళీ మైదానం గారికి ఇచ్చేస్తాను!" అన్నాడు సౌమ్యంగా.

"నా ప్రాణం పోయినా ఇవ్వనని చెప్పగా... ఎన్నిసార్లు చెప్పినా నీ గొర్రె బుర్రకు అర్థం కాదా?" అంది దృఢ నిశ్చయంతో.

"గాయత్రీ! నీ వాలకం చూస్తుంటే...నువ్వు ఈ రోజు ఎందుకో పని కట్టుకుని గొడవ పెట్టు కోవాలని నిర్ణయించుకున్నట్టున్నావ్. నీ కాళ్ళు పట్టుకుంటాను ఆ డీవీడి ఇవ్వు!" అన్నాడు.

"నేను ఇవ్వను గాక ఇవ్వను! ఇక్కడ చూడక పోయినా... ఆ మైదానంగాడి కొంపకు వెళ్లి అక్కడ చొంగ కార్చుకుంటూ చూస్తావ్."

"ఎందుకు గాయత్రి?... చిన్న విషయానికి ఇంత రాద్ధాంతం చేస్తున్నావ్?"

"మరి నువ్వు పద్ధతిగా ఉండాలిగా!"

"నేను పద్ధతిగా లేనని ఎందుకనుకుంటు న్నావ్?"

"నువ్వు పద్ధతిగలవాడివైతే... ఇలాంటి సినిమాలు ఎందుకు చూస్తావ్?"

"ఇక చూడను గానీ... ఆ డీవీడి ఇవ్వు! మైదానంగారికి ఇచ్చేస్తాను." అని అన్నాడు.

"నేను చచ్చినా నమ్మను..." అని గాయత్రి ఆ డీవీడీని గోడకేసి బరాబరా రాసి, ఏకవీర మొహం మీదకి విసిరేసి వెళ్లబోయింది.

క్షణికావేశంలో ఏకవీర అక్కడున్న ఐరన్ ఫ్లవర్ వాజ్‌ను తీసుకుని... గాయత్రి మీదికి విసిరేశాడు. అది గాయత్రి తలకు గట్టిగా తగిలింది. దాంతో స్పృహతప్పి కుప్పకూలి పోయి ప్రాణాలు వదిలింది.

ఏకవీర షాక్ అయి గాయత్రి ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూశాడు.

ఊపిరి రావడం లేదు.

భయంతో వణికి పోయాడు.

ఇంతలో ఏకవీర మొబైల్ రింగ్ అయింది.

ఫోన్ చేసింది డైరెక్టర్ మైదానం.

ఏకవీర ఫోన్ లిఫ్ట్ చేశాడు.

"ఆ ఏకవీరా! నువ్వు ఆ సినిమా చూశాక మా ఇంటికి రా. ఆ టైటిల్‌కు తగ్గట్టు నాకు మంచి స్టోరీ ఐడియా వచ్చింది. ఇద్దరం డిస్కస్ చేద్దాం." అని మైదానం కాల్ కట్ చేశాడు.

ఏకవీర భార్య శవం ముందు ఏడుస్తూ...

"హౌటు మర్డర్ యువర్ వైఫ్" అనే టైటిల్‌ని ఫుల్లుగా జస్టిఫై చేశావ్ కదూ గాయిత్రీ!" అని ఏకవీర లబలబా ఏడుస్తున్నాడు.






## నా చిన్నప్పటి మాహిష్మతి సామ్రాజ్యం(1975-85)

**పచ్చని పంట పొలాలతో... పైరగాలి పలకరింపులతో, నిండుగా ప్రవహించే గోదావరి కాలువ, మంచినీటి దేవుడి చెరువు, స్వచ్ఛమైన పాడిపంటలు, ఇళ్ల ముందు నిండైన ధాన్యం గాదెలు, ఇంటి వెనుక పెరటి తోటలు, సందడి చేసే ఆలమందలతో కళకళలాడే, పశ్చిమగోదావరి జిల్లా 'భీమడోలు' మా ఊరు.**

**సాధారణంగా గోదావరి ప్రాంత పల్లెలన్నీ ఇంచుమించు ఒకేలా వున్నా... మా 'భీమడోలు' మాత్రం కొంచెం స్పెషల్!**

ఊరంతా ఒక పక్కనుంటే, మరో పక్క రైల్వే స్టేషన్, రెండు లైన్ల రైలు పట్టాలు, ఆ పట్టాల పక్కాగా దట్టంగా రెల్లుగడ్డి, తామర, కలువ పూలతో పరుచుకున్న నిలువ నీటి కొలను, దానికి ఆనుకొని కలకత్తా - మద్రాసు జాతీయ రహదారి, దానికి ఆనుకొని తెరచాప పడవలు తిరిగే గోదావరి కాలువ... ఆ కాలువ కింద పచ్చని తివాచి పరచినట్లు వరి పంట పొలాలు... ఆ దృశ్యాన్ని మావూరి రైల్వే స్టేషన్ బ్రిడ్జి పైనుంచి చుస్తే... నల్లరేగడి రవికపై పచ్చని పంట చీరకు మూడంచుల పవిట కప్పి నట్టు అందమైన కాన్వాస్ పెయింటింగ్‌లా వుంటుంది.

అలాగే రజనీకాంత్ పాపులర్ డైలాగ్ "నా దారి రహదారి'కి మించి 'మావూరికి రెండు రహదారులు' అని చెప్పొచ్చు.




వూరికి ముందు, గుండుగొలను దగ్గర విడి పోయిన ఆ రెండో రహదారి, ద్వారకా తిరు మల వెళ్లే జంక్షన్ దగ్గర టాటా చెప్తూ రాజ మండ్రి వైపు సాగిపోతుంటుంది. ఆ దారంతా, తమలపాకు పాదులు, మామిడి తోరణాలు, జీడిమామిడి, అరటి, నిమ్మ, నారింజ, పండ్ల తోటలతో సీమంతం పెళ్ళికూతురిలా నిండుగా ఉంటుంది.

అలా రెండు రహదారుల మధ్యలో వూరు ఉండడంతో, ఎటు దగ్గర ఇళ్ళు ఉండేవారు అటు వచ్చి పోయే బస్సుల్లో ప్రయాణాలు చేసే బంపర్ అఫర్ వుంది.

ఇక ఊరి మధ్యలో వారికి అటూ - ఇటూ బస్సుల్లో, లేదంటే పాసింజర్ పొగబండి రైలు ప్రయాణం చేసే మూడు ఆప్షన్స్ ఉన్నాయి.

మా ఊరి రైల్వే స్టేషన్... డైరెక్టర్ వంశీ 'ఏప్రిల్ ఒకటి విడుదల' సినిమాల్లో రైల్వే స్టేషన్ లాగా అచ్చు గుద్దినట్లు, రైల్వే క్వార్టర్స్‌తో కలిసి వుండే ఒక చిన్న సైజు రైల్వే స్టేషన్ మాది. సైజులో చిన్నదే కానీ, ప్రయాణికుల విషయం లో మాత్రం ఒక జంక్షన్ లాంటిది. ఎందు కంటే... రైలు రూట్ లేని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) కి, దగ్గరలో వున్నది భీమడోలు ఒక్కటే అవ్వడంతో, మా వూరి రైల్వే స్టేషన్‌కు, ఆ వెంకటేశ్వర స్వామి భక్తుల తాకిడి ఎక్కువ, పొద్దున్న దిగేటప్పుడు వెంకన్న మొక్కులకోసం పెంచుకున్న నెత్తిమీద జులపాలు, మీసం గడ్డాలతో కనిపించే జనం, సాయంత్రం రిటర్న్ జర్నీకి నున్నటి గుండ్లు, దానిపై చందనం పూతలు, క్లీన్‌షేవింగ్‌తో హిందీ విలన్ అమ్రేష్ పురి టైపులో కనిపించే వారు.. మరికొంతమంది యంగ్ అండ్ సిగ్గు బ్యాచ్, గుండు కనపడకుండా దేవానంద్ టోపీ లతో కవరింగులు చేసుకునేవారు.

ఇక పిల్ల గుండూ బ్యాచ్ అక్కడ కొనుక్కున్న బూరలు, గిలిగిచ్చ కాయల సౌండ్స్‌తో, మా ఊరి రైల్వే స్టేషనంతా మోత మోగిపోయేది.

మరి పెళ్లిళ్ల సీజన్ ఐతే... ఆ సందడే వేరు! కొత్త పెళ్లి జంటలు పెళ్లి మండపాలనుంచి, అదే పెళ్లి పసుపు బట్టల్లో, నెత్తిమీద జీలకర్రా

బెల్లం తలంబ్రాలతో, నేరుగా స్వామివారి తొలిదర్శనాలకి వచ్చే ఆన వాయితీ తెలిసిందే, తిరుపతికి ముందు వారందరు తొక్కే తొలి గడప, మా ఊరి రైల్వేస్టేషనే.

అప్పటికే పెళ్లి తంతు అలసటతో ఒకరి భుజంపై మరొకరు వాలి పోతున్న కొత్త జంట ముచ్చట్లు ఒకపక్క.. పెళ్లి తంతులో జరిగిన తేడాలతో వియ్యాలవారి కయ్యాల రచ్చ మరోపక్క!...అలా వచ్చే పెళ్లి బ్యాచ్‌ల్లో, తూర్పుగోదావరి, శ్రీకాకుళంవైపు జనాలు ఎక్కువగా ఉండే వారు, వారి యాసలో సాగే... 'ఓ లప్పా...ఏదోటి అయిపోనాది కదా! మరిక ఒగ్గేయే..." లాంటి సంవాదాలు వినడానికి సరదాగా ఉండేవి.

అలాగే వివిధ ప్రాంతాలనుంచి, బట్టలు, బుట్టలు లాంటి వస్తువులు అమ్ముకునేవారి రాకపోకలతో, మా ఊరి పంటలు, చేపల బట్టలతో వేరే ఊరి సంతలకి వెళ్లేవారి హడావుడితో నిత్యం సందడిగా ఉండేది మా భీమడోలు రైల్వే స్టేషన్.

రైల్వేస్టేషన్‌కి కూత వేటు దూరంలో పోలీస్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌కి విజిల్ వేటు దూరంలో పోలీస్ క్వార్టర్స్ ఉండడంతో... రేల్వే క్వార్టర్స్, పోలీస్ లైన్ బచ్చా పార్టీకి ఫ్రెండ్స్ అడ్డా కూడా మా ఊరి రైల్వేస్టేషనే...మా వూరి పోలీస్ లైన్ కూడా, రైలు బండి లాగానే ఉండేది... ఒక ఇంటి పక్కనే మరొకటి ఆనుకొని, ఆ కొస నుంచి-ఈ కొస దాకా వరు సగా ఇంజిన్ లేని రైలు పెట్టెలు ఆగినట్లు వుండేవి. మరి పోలీ సోరి అబ్బాయిగా నేను పుట్టింది కూడా ఆ పోలీస్ లైన్లోనే కాబట్టి, పోలీస్ లైన్లోనే దొంగాటలు ఆడు కునే అదృష్టం కుడా దక్కింది.

ఒక విధంగా పల్లెటూరిలో పుట్టడం ఓ గొప్ప అదష్టం!

ఎందుకంటే... పల్లె ఇరుగు పొరుగు పిలుపులన్నీ చుట్టరికాలతోనే ఉంటాయి కాబట్టి, ఏ ఒక్క కుటుంబంలో బిడ్డ పుట్టినా... ఆ ఒక్క ఇంటికే పరిమితం కాకుండా, ఎదురింటి వెంకీ మామకు ఓ చిన్న మేనల్లుడు, పక్కింటి రాధికా పిన్నిగారికి మరో బుడుగు, వెనుక వీధి అన్నపూర్ణ బామ్మగారికి ఓ గడుగ్గాయి మనవడు, వీధిలోని బచ్చా పార్టీకి ఓ బుజ్జి తమ్ముడు. ఆ ఊరి ఆట మైదానానికి మరో చడ్డీ కిలాడీ కూడా పుడతాడు.

అలా పుట్టిన బిడ్డకి అమ్మ ఒడి దిగి పాక్కుంటూ... గుమ్మం దాటే ప్రయత్నం నుంచి, అమ్మా నాన్నల భుజాల ఎత్తులో కొత్తగా ఊరుని చూస్తున్నప్పుడు, వాడి జీరో సైజు బుర్రకి, తొలిసారిగా చూస్తున్న ఆ వూరి ప్రత్యేకతే పెద్ద మాహిష్మతి సామ్రాజ్యంలా కనిపిస్తుంది.

వాడి బుజ్జి కాళ్ల లిల్లీపుట్ ఎత్తుకి...

చెరువు గట్టే చైనా వాల్ లాగా...

గోదారి కలువే బంగాళాఖాతంలా...

ఊరి టూరింగ్ టాకీస్ ఒక అరుంధతి కోటలాగా...

ఇంక రైల్వే స్టేషన్‌లో, బొగ్గు ఇంజిన్ రైలైతే చెప్ప నక్కరలేదు, వేడి వేడి పొగలు కక్కుతూ దగ్గర కొచ్చి ఒక్కసారి 'కూ' అని కూతపెడితే చాలు... ఆ సైజు పిల్లగాళ్లందరికి గుండె గుబేల్ అనాల్సిందే!




ఇక రైల్వే బ్రిడ్జి ఎక్కి ఏరియల్ వ్యూలో, వూరి పొలిమేర దాటి, ఆకాశం అంచు దాకా కలిసే పంట చేలను చూస్తే...

మా ఊరు ప్రతి బాల బాహుబలికి... నిజంగానే అదొక మినీ మాహిష్మతి సామ్రాజ్యమే!

**(మరిన్ని ముచ్చట్లు వచ్చే సంచికలో)**



# అపార్థాల అనసూయమ్మ!

బొల్లిముంత వెంకటరమణారావు
9347592054

**"వసుధా! వసుధా!! మా బాబు లేడా?" అని గేటు దగ్గర నుంచే కేక వేసింది అనసూయమ్మ.**

**"ఇంట్లో లేరని మీకు ఎలా తెలుసు పిన్నిగారు?" నవ్వుతూ అడిగింది వసుధ.**

**"ఇంట్లో ఉన్నప్పుడు తాలింపులో పోపు గింజల్లా చిటపట లాడుతూ ఉంటారు. మీ మాటలు మైకు లేకుండానే మా ఇంటి దాకా వినిపిస్తాయి... అయినా సంసారం అన్న తర్వాత ధుమధుమలాడటం మామూలే తల్లి....**

మీ బాబాయి బతికి ఉన్న రోజుల్లో మేమూ ఇలాగే చిటపటలాడే వాళ్లం. నేను భర్తను ఆట పట్టించేదాన్ని. ఆ తర్వాత ఆయన రాజీ పడేవారు. నేను మాత్రం ససేమిరా రాజీకి వచ్చేదాన్ని కాదు. చివరికి అంతా నా తప్పే అని లెంపలు వేసుకునేవారు. 'మీ బుద్ధి కుక్కతోక వంకరలా ఉంటుందండి' అని ఎగతాళి చేసేదాన్ని.

'నన్ను కుక్కతో పోలుస్తున్నావా?' అని బిగుసుకుపోయేవారు.

'మిమ్మల్ని వేరే జంతువుతో పోల్చలేను. నన్ను క్షమించండి' అనేదాన్ని. ఆ మాటకు ఇంకా మండిపడేవారు."

వసుధ నవ్వుకుంది.

"ఇంతకీ మా బాబు...?"

"స్కూలుకు వెళ్లారు."

"ఈ వయసులో స్కూలుకు వెళ్లడం ఏమిటి? ఏదో చిన్న ఉద్యోగం చేసుకుని సంసారం నెట్టుకోవాలి గానీ, ఈ వయసులో చదువులా? చదువు పూర్తి అయ్యేసరికి ఉద్యోగాలు ఉంటాయో లేదో! చదివినవారికే ఉద్యోగాలు లేవని చెబుతున్నారు... కొందరైతే ఉద్యోగాలు పోయి బజారున పడుతున్నారు. చదువు చిన్నతనంలోనే చదువుకోవాలి. అంతే గానీ, వయస్సు పలక బలపం పట్టుకుని ఊరేగితే ఎలా?"

"పిన్నిగారు, మీరు అపార్థం చేసుకుంటున్నారు."

"అపార్థమా? నేను జీవితంలో ఎప్పుడూ అపార్థం చేసుకోలేదు."

"నా మాట పూర్తిగా వినండి..."

"వినడానికి ఏముంటుంది? ప్రతి ఆడపిల్లా తన మొగుడ్నే సమర్థించు కుంటుంది."

ఇంతలో ఇంట్లోనుంచి పిలుపు వచ్చింది.

"అదిగో! నా కోడలు రాక్షసి నంజుకుని తినడానికి పిలుస్తోంది. వస్తాను తల్లి." అని వెళ్లిపోయింది.

వసుధ నవ్వుకుంటూ నిలబడిపోయింది.

✦✦✦

సాయంత్రం ప్రసాదరావు గేటు తీసుకుని లోపలికి వస్తుండగా ఎదురుగా అనసూయమ్మ కనిపించింది.

"ప్రసాదరావూ! కాస్త ఆగు!.. పెద్దదాన్ని, కోపం తెచ్చుకోకు. ఒక మాట అడుగుతాను."

"అడగండి పిన్నిగారు."

"ఈ వయసులో స్కూలుకు వెళ్లి ఏం చదువుతున్నావు?"

ప్రసాదరావు ఆశ్చర్యంగా చూశాడు.

"నేనా!?"




"అవునయ్యా, నువ్వే! ఏ క్లాసు?"

"ఏ క్లాసా?"

"అవును. పదో తరగతా? ఇంటరా? ఓపెన్ స్కూలా?"

ప్రసాదరావు నవ్వు ఆపుకున్నాడు.

"పిన్నిగారు, నేనేమీ చదువుకోవడం లేదు."

"సిగ్గుపడకు. చదువుకోవడం తప్పు కాదు. కానీ ఈ వయసులో పదో తరగతి అయితే కాస్త కష్టమే."

"నేను పదో తరగతి చదవడం లేదు."

"అయితే ఇంటరేమో! అందుకే ప్రతిరోజూ బ్యాగు వేసుకుని వెళ్తున్నావు."

"అది స్కూల్ బ్యాగు కాదు పిన్నిగారు."

"మరి టిఫిన్ డబ్బా ఎందుకు తీసుకెళ్తావు?

పరీక్షలప్పుడు ఆకలి వేస్తుందని కదా!"

ప్రసాదరావుకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

అప్పుడే వసుధ బయటకు వచ్చింది.

"పిన్నిగారు, ఆయన స్కూలుకు చదువుకోవ డానికి వెళ్లరు."

"మరీ?"

"చదివించడానికి వెళ్తారు."

"అంటే?.."

"ఆయన టీచర్."

అనసూయమ్మ రెండు క్షణాలు నిశ్శబ్దంగా నిలబడిపోయింది.

"టీచరా!?"

"అవును."

"అంటే పిల్లలకు పాఠాలు చెప్పేది నువ్వా?"

"అవును!"

"అయ్యో రామా!... నేను ఇన్ని రోజులూ నిన్ను బెంచ్ మీద కూర్చొని హోంవర్క్ రాసు కునే విద్యార్థి అనుకున్నానే!"

అందరూ నవ్వుకున్నారు.

కొద్దిసేపటి తర్వాత ప్రసాదరావు అడిగాడు.

"పిన్నిగారు! మీ అబ్బాయి జగదీష్ కనిపిం చడం లేదు?"

"వాడికి ఒకటే పని ఒత్తిడి. నీలా కాలక్షేపంగా స్కూలుకు వెళ్లడం లేదు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తు న్నాడు."

"పెంపకాలు సరిగ్గా లేకపోతే... పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిందే."

"ఇంతకీ ఏం తప్పు చేశాడు?"

"వాడు తప్పు చేయడం ఏమిటి? వాడు మహా బుద్ధిమంతుడు."

"తప్పు చేయనప్పుడు... పోలీస్ స్టేషన్‌కు ఎందుకు వెళ్తాడు?"

"ఉద్యోగం చేసుకుంటున్నాడు కాబట్టి."

"ఏం ఉద్యోగం? దొంగతనమా?"

"భలేవాడివే!...మా వాడికి అంత కర్మ పట్ట లేదు. వాడు పోలీస్. చిన్నప్పటి నుంచీ పోలీస్ కావాలని... ఇప్పుడు పోలీస్ అయ్యాడు."

ప్రసాదరావు నవ్వాడు.

"పిన్నిగారు! మీరు నన్ను చదువుకుంటు న్నాననుకున్నారు... నేను జగదీష్ ఏదో కేసులో చిక్కుకున్నాడనుకున్నాను."

అనసూయమ్మ ఒక్కసారిగా ఆగిపోయింది.

"అంటే?"

"మనిద్దరం ఒకటే. పూర్తి విషయం విన కుండా తీర్పు చెప్పేశాం."

"నిజమే ప్రసాదం!... నా చెవులు సగం వింటాయి. సగం ఊహించుకుంటాయి." అని చెప్పి నవ్వింది.

"అయితే చెప్పు! ఏ సబ్జెక్టు చెబుతావు?"

"తెలుగు."

"అయ్యో! అయితే నీ దగ్గర నేనే చేరాలి... నేను విన్నది ఒకటి, అర్థం చేసుకున్నది ఇంకోటి. తెలుగు నేర్చుకుంటే అపార్థాలు తగ్గ తాయేమో!"అంది.

వసుధ, ప్రసాదరావు ఇద్దరూ గట్టిగా నవ్వేశారు.





# వివిధ సంస్కృతులలో హాస్యం... ప్రాముఖ్యత



ఏ.దయాకర్
Cartoonist & Animator

**సంస్కృతులు మారవచ్చు... జోకులు మారవచ్చు, కానీ నవ్వడం వల్ల వచ్చే ఆనందం మాత్రం ప్రపంచమంతటా ఒకటే. సైన్స్ పరంగా చూసినా, సంస్కృతి పరంగా చూసినా... సీరియస్‌గా ఉండటం కంటే సరదాగా నవ్వుతూ సాగిపోవడమే మనిషి మనుగడకు అత్యంత అవసరం. ఒకరినొకరు చూసి నవ్వుకోవడం కంటే, ఒకరితో ఒకరు కలిసి నవ్వడంలోనే మానవత్వపు అసలైన సౌందర్యం దాగి ఉంది!**

**ఈజిప్ట్,** ఇరాక్, ఇరాన్, సిరియా, జోర్డాన్, లెబనాన్, సౌదీ అరేబియా, టర్కీ, యునైటెడ్ అరబ్ఎమిరేట్స్ మొదలైన సంస్కృతిలో హాస్యం చాలా ప్రత్యేకమైనది. ఇక్కడి కఠినమైన భౌగోళిక పరిస్థితులు, రాజకీయ ఒడిదుడుకులు, మరియు బలమైన మతపరమైన, సామాజిక కట్టుబాట్ల మధ్య హాస్యం ఒక 'ఆశాకిరణంలా' మరియు 'రక్షణ కవచంలా' రూపాంతరం చెందింది.

అరబ్ సంస్కృతిలో హాస్యాన్ని 'నుక్తా' అని పిలుస్తారు. ఇక్కడి అనేక ప్రాంతాలు ఎడారులతో నిండి ఉంటాయి. అక్కడి ప్రజల జీవితం ప్రకృతితో పోరాటమే. నీటికొరత, తీవ్ర ఉష్ణోగ్రతలు, దీర్ఘ ప్రయాణాలు వంటి కష్టాల మధ్య జీవించిన ప్రజలు తమ బాధలను తగ్గించుకోవడానికి హాస్యాన్ని ఆశ్రయించారు.



ఒక ప్రయాణికుడు ఎడారిలో నడుస్తూ అన్నాడు: "ఇంకా ఎంత దూరం?"
స్థానికుడు నవ్వుతూ చెప్పాడు: "దాహం వేసే వరకు."

ఈ సమాధానం ఒకవైపు సరదాగా ఉంటుంది; మరోవైపు ఎడారి జీవితాన్ని ప్రతిబింబిస్తుంది.

**సాంప్రదాయ మరియు జానపద హాస్యం**

మధ్యప్రాచ్య దేశాలలో హాస్యానికి కొన్ని శతాబ్దాల నాటి గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడి జానపద కథలలో బుద్ధికుశలత, అమాయకత్వం కలగలిసిన పాత్రల ద్వారా హాస్యాన్ని పండించేవారు.

**జుహా నస్రుద్దీన్ హోడ్జా:** మధ్యప్రాచ్య మరియు టర్కీ జానపద సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధమైన హాస్య పాత్ర 'జుహా'... అతను ఒకే సమయంలో మూర్ఖుడి గానూ, పరమ జ్ఞానిగానూ ప్రవర్తిస్తూ నవ్విస్తాడు. (ఉదాహరణకు: జుహా తన కొడుకు, గాడిదతో కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు ఊరి జనాలు చేసే విమర్శ లకు అనుగుణంగా ప్రవర్తిస్తూ.. చివరికి గాడిదను తనే నెత్తిన పెట్టుకునే కథ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది).

**అరేబియన్ నైట్స్ :** ఈ క్లాసిక్ కథలలో కేవలం సాహసాలే కాకుండా, అల్లావుద్దీన్ లేదా అలీ బాబా కథల మధ్యలో వచ్చే వింతైన మనుషులు, దొంగల అమాయకపు పనుల ద్వారా అద్భుతమైన అరబిక్ హాస్యాన్ని పండించారు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందాయి.

**రాజకీయ మరియు సామాజిక వ్యంగ్యం**

మధ్యప్రాచ్య దేశాలలో కఠినమైన సెన్సార్‌షిప్, రాజకీయ ఒత్తిడులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల, ఇక్కడి ప్రజలు తమ అసంతృప్తిని, కష్టాలను నేరుగా చెప్పలేక 'వ్యంగ్యం' రూపంలో వ్యక్తపరుస్తారు.

**ఈజిప్షియన్ హాస్యం:** అరబ్ ప్రపంచంలో

ఈజిప్ట్‌ను 'కామెడీ రాజధాని' అని పిలుస్తారు. ఇక్కడి ప్రజలు ఎంతటి ఘోరమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు ఎదురైనా వాటిపై జోకులు వేసి నవ్వుకుంటారు. వీరిని ప్రపంచంలోనే అత్యంత సరదా కలిగిన వ్యక్తులుగా భావిస్తారు.

**థియేటర్ మరియు నాటకాలు:** లిబియా, సిరియా వంటి దేశాల్లో యుద్ధవాతావరణం ఉన్నప్పుడు కూడా, స్థానిక కళాకారులు నాటకాల ద్వారా అక్కడి కష్టాలను వ్యంగ్యంగా చూపిస్తూ ప్రజల్లో ధైర్యాన్ని నింపేవారు.

**ఆధునిక స్టాండప్ కామెడీ మరియు డిజిటల్ హాస్యం:** ప్రస్తుత తరం మధ్యప్రాచ్య యువత పాశ్చాత్య దేశాల శైలిని అలవర్చుకుంటూనే, తమ సొంత సంస్కృతిని జోడించి కొత్త తరం హాస్యాన్ని సృష్టిస్తున్నారు.



మేజ్ జోబ్రానీ

**అరబ్-అమెరికన్ స్టాండప్ కామెడీ:** మేజ్ జోబ్రానీ, మొ అమీర్ వంటి ప్రముఖ స్టాండప్ కమెడియన్లు పాశ్చాత్య దేశాలలో అరబ్ ప్రజలపై ఉండే అపోహలను తమ హాస్యంతో పటాపంచలు చేస్తున్నారు. "మేము కూడా మీలాగే నవ్వుతాం, జోకులు వేస్తాం" అని ప్రపంచానికి చాటి చెబుతున్నారు.

**సోషల్ మీడియా మీమ్స్:** రంజాన్ ఉపవాసాల సమయం నాటి ఆకలి ఇబ్బందులు, కఠినమైన అరబ్ తల్లుల 'చప్పల్' దెబ్బల గురించి ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లలో వచ్చే ఫన్నీ వీడియోలు ఇక్కడ విపరీతమైన ట్రెండ్.

మధ్యప్రాచ్య సంస్కృతిలో హాస్యం అనేది కేవలం ఒక వినోదం కాదు; అది కష్టకాలంలో గుండె నిబ్బరాన్ని ఇచ్చే ఒక 'జీవన సంజీవని'. సంప్రదాయాలు మరియు మతపరమైన పరిమితులను గౌరవిస్తూనే, సమాజంలోని లోపాలను 'నుక్తా' (జోక్స్) రూపంలో సున్నితంగా ఎండగట్టడం, తమ కష్టాలను చూసి తామే నవ్వుకుంటూ జీవితాన్ని ముందుకు సాగించడం మధ్యప్రాచ్య హాస్య శైలి యొక్క ప్రత్యేకత!

**ఆఫ్రికన్ సంస్కృతులలో హాస్యం**

ఆఫ్రికా ఖండం అనగానే మనకు వైవిధ్యభరితమైన తెగలు, అద్భుతమైన జానపద కళలు, మరియు శతాబ్దాల నాటి సంస్కృతులు గుర్తొస్తాయి. ఆఫ్రికన్ సంస్కృతిలో హాస్యం అనేది కేవలం సమయం గడపడానికి చేసే వినోదం కాదు; అది సమాజ ఐక్యత, 'కథాప్రవచనం' మరియు శతాబ్దాలుగా వారు అనుభవించిన వలసపాలన,పేదరికం,కష్టాలను ఎదురించడానికి వాడుకున్న 'జీవన ఆయుధం'. జానపద కథలు మరియు ట్రిక్‌స్టర్ క్యారెక్టర్స్ ఆఫ్రికన్ సాంప్రదాయ హాస్యానికి మూలాలు వారి మౌఖిక సాహిత్యం మరియు జానపద కథలలో ఉన్నాయి.



తరతరాలుగా కథలు చెబుతూ నవ్వించడం, అదే సమయంలో నీతిని బోధించడం వీరి శైలి.

అనేక ఆఫ్రికన్ గిరిజన సమూహాల్లో వివాదాలు, కుటుంబ కలహాలు నవ్వుతోనే పరిష్కరించబడతాయి.

**అనాన్సి ది స్పైడర్:** పశ్చిమఆఫ్రికా(ముఖ్యంగా ఘనా దేశం) జానపద కథలలో 'అనాన్సి' అనే సాలీడు పాత్ర అత్యంత ప్రసిద్ధమైనది. ఈ సాలీడు చాలా వింతైనది, కొంటెది మరియు తెలివైంది. తనకంటే పెద్దవైన సింహం, ఏనుగు వంటి జంతువులను తన హాస్యచతురతతో, మోసపూరిత ఉపాయాలతో బురిడీ కొట్టించి ప్రేక్షకులను నవ్విస్తుంది.

**హరే (కుందేలు) కథలు:** తూర్పు మరియు దక్షిణ ఆఫ్రికా కథలలో కుందేలు పాత్ర తన వేగంతో, సమయస్ఫూర్తితో పెద్ద జంతువులను ఆటపట్టిస్తూ హాస్యాన్ని పండిస్తుంది.

ఆఫ్రికాలోని అనేక తెగలలో పరస్పరం ఎగతాళి చేసుకునే అధికారిక సామాజిక ఒప్పందాలు ఉంటాయి. దీనిని 'జోకింగ్ రిలేషన్‌షిప్స్'అంటారు.

**సెనెగల్ మరియు మాలి దేశాలలో:** కొన్ని నిర్దిష్ట తెగల వారు వీధిలో కలిసినప్పుడు ఒకరినొకరు సరదాగా తిట్టుకుంటారు,జోకులు వేసుకుంటారు. దీనివల్ల వారి మధ్య శత్రుత్వం పోయి స్నేహం బలపడుతుంది.

**కమ్యూనిటీ థియేటర్:** ఆఫ్రికన్ గ్రామాలలో వీధి నాటకాల ద్వారా లోభత్వం, బద్ధకం ఉన్న వ్యక్తులను అందరి ముందు హాస్యంగా చూపిస్తూ నవ్విస్తారు. ఇది వారిని అవమానించడానికి కాదు, పరోక్షంగా వారి ప్రవర్తనను మార్చుకోవాలని చెప్పడానికి.

హాస్యం ప్రపంచవ్యాప్తంగా ఒకటే, కానీ ప్రతి సంస్కృతిలో ప్రత్యేకమే.

ప్రపంచంలోని ప్రతి సంస్కృతి తనదైన ప్రత్యేక శైలితో హాస్యాన్ని అలంకరించుకుంది. ఆభరణాలు వేరైనా బంగారం ఒకటే అన్నట్లు, హాస్య రూపాలు వేరైనా దాని వెనుక ఉన్న మానవ స్పందన ఒక్కటే.

నవ్వు నాలుగు విధాల చేటు కాకూడదని తూర్పు ఆసియా సంస్కృతి హెచ్చరిస్తే, మనసు విప్పి నవ్వే నవ్వే అసలైన నవ్వని భారతీయ సంస్కృతి చెబుతుంది. ఏది ఏమైనా, ప్రపంచ శాంతికి, మానవజాతి మనుగడకు నవ్వు కంటే గొప్ప ఔషధం మరొకటి లేదు. సైన్స్ పరంగా చూసినా, సంస్కృతి పరంగా చూసినా... సీరియస్‌గా ఉండటం కంటే సరదాగా నవ్వుతూ సాగిపోవడమే మనిషి మనుగడకు అత్యంత అవసరం. సంస్కృతులు మారవచ్చు, జోకులు మారవచ్చు, కానీ నవ్వడం వల్ల వచ్చే ఆనందం మాత్రం ప్రపంచమంతటా ఒకటే.



ప్రతి నెలా ఇతర భాషలకు చెందిన ఒక భారతీయ కార్టూనిస్టుల పరిచయం

**నిర్వహణ: నాగిశెట్టి**

## శ్రీ సదాశివన్ ఇరియన్ని

**కేరళకు** చెందిన **శ్రీ సదాశివన్ ఇరియన్ని** ఈ నెల మన ఇండియన్ ఇంక్ హీరో! సరళమైన గీతలతో చక్కటి హాస్యభరితమైన కార్టూన్లు గీసే వీరి తల్లితండ్రులు వెంకటేశ్వర భట్, వెంకటేశ్వరి. భార్య లలిత, కుమారుడు శ్రీహరి.

వీరు పదవ తరగతి వరకు కాసర్‌గోడ్ జిల్లాలోని ఇరియన్ని పాఠశాలలో చదివారు. విద్యానగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో ప్రీ-డిగ్రీ పూర్తి చేసి, ఆ తర్వాత కాన్హాగాండ్‌లోని నిత్యానంద పాలిటెక్నిక్ నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పొందారు.

వీరి మాతృ భాష కన్నడ. అయితే వీరి విద్య మలయాళం మీడియంలో జరగడంతో, కన్నడంలో మరియు మలయాళంలో రెండు చేతులతో కార్టూన్లు గీసేస్తుంటారు.

కార్టూనిస్ట్‌గా ఈయన ప్రయాణం 1984లో ప్రారంభమైంది. ఆ సంవత్సరంలోనే వీరి మొదటి కార్టూన్ కన్నడ పత్రిక 'కస్తూరి'లో ప్రచురితమైంది. అదే కార్టూన్ ప్రపంచంలో వీరి సుదీర్ఘమైన, మధురమైన ప్రయాణానికి నాంది పలికింది. ఆ తర్వాత 'సుధ', 'మయూర', 'తరంగ', 'తుషార','మంగళ', 'మల్లిగ' వంటి అనేక కన్నడ పత్రికలలో వీరి కార్టూన్లు ప్రచురితమయ్యాయి.

మలయాళంలో వీరి మొదటి కార్టూన్ 1989లో 'మలయాళ మనోరమ వీక్లీ'లో అచ్చయింది. అప్పటి నుండి 'మంగళం', 'సఖి', 'పక్కనార్', 'హాస్య కైరళి', 'చిరి వీందుమ్ చిరి', 'యోజన' వంటి వివిధ మలయాళ ప్రచురణలలో వీరి కార్టూన్లు వచ్చాయి.

2003 నుండి కాసర్‌గోడ్ నుండి వెలువడే స్థానిక దినపత్రిక 'కరవాల్' కోసం ఈయన క్రమం తప్పకుండా ఒక కార్టూన్ కాలమ్‌ను రాస్తూ, బొమ్మలు వేస్తున్నారు. ఇది వీరి కార్టూన్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన భాగం.

ఇప్పటివరకు వివిధ వార్తాపత్రికలు, మేగజైన్లు మరియు ఇతర ప్రచురణలలో వీరివి 8,000కి పైగా కార్టూన్లు ప్రచురితమయ్యాయి.






కార్టూనింగ్ మీద వీరికి ఆసక్తి వీరి కుటుంబం ద్వారానే కలిగింది. వీరి కజిన్స్ ఇద్దరు కార్టూనిస్టులే. వారి కార్టూన్లు సదాశివన్ గారిని ఎంతగానో ప్రేరేపించాయి; వీరూ కార్టూన్లు గీయడానికి ప్రోత్సహించాయి. మొదట్లో ఒక స్ఫూర్తిగా ప్రారంభమైనది క్రమక్రమేణా వీరికి అభిరుచిగా మారి, చివరకు ఈయన జీవితంలో అంతర్భాగమైంది.

కార్టూనింగ్‌తో పాటు శ్రీ సదాశివన్ కేరళ ప్రభుత్వంలో పనిచేశారు; కాసర్‌గోడ్ జిల్లాలోని వివిధ గ్రామాలలో సేవలందించారు.

2024లో జూనియర్ సూపరింటెండెంట్ హోదాలో పదవీ విరమణ చేశారు. రిటైర్మెంట్ తర్వాత, దశాబ్దాలుగా తను ప్రేమించిన కళకే పూర్తిగా అంకితం కావాలని నిర్ణయించుకున్నారు.

ఇప్పుడు శ్రీ సదాశివన్ పూర్తి స్థాయి కార్టూనిస్ట్‌గా పనిచేస్తున్నారు.

శ్రీ సదాశివన్ కాసర్‌గోడ్ జిల్లాలోని పాఠశాలల్లో కార్టూన్ ప్రదర్శనలను కూడా నిర్వహించారు. ఈ ప్రదర్శనల ద్వారా పిల్లలకు కార్టూన్ ప్రపంచాన్ని పరిచయం చేయడానికి, పరిశీలనా శక్తిని పెంపొందించుకోవడానికి, సృజనాత్మకంగా ఆలోచించడానికి కళ, హాస్యం ద్వారా తమభావాలను వ్యక్తపరచడానికి ప్రయత్నించారు.

ప్రస్తుతం వీరు 'మలయాళ మనోరమ వీక్లీ' కోసం క్రమం తప్పకుండా కార్టూన్లు వేస్తున్నారు.




సామాజిక కార్టూన్లు వేయడం వీరికి చాలా ఇష్టం, ఎందుకంటే ఇవి దైనందిన జీవితాన్ని పరిశీలించడానికి, సామాజిక సమస్యలను హాస్యం ద్వారా వ్యక్తపరచడానికి అవకాశం కల్పిస్తాయి అంటారు.

క్యాప్షన్ లేని కార్టూన్లంటే తనకి ప్రత్యేకమైన ఇష్టం అనే వీరు "డైలాగులు ఉన్న కార్టూన్లతో పోలిస్తే, క్యాప్షన్ లేని కార్టూన్‌ను సృష్టించడం సవాల్‌తో కూడుకున్నది; ఎందుకంటే అందులోని భావనను, హాస్యాన్ని పూర్తిగా దృశ్యాల ద్వారానే వ్యక్తపరచాల్సి ఉంటుంది. అయితే, అదే వాటికి ప్రత్యేకతను తెస్తుంది. ఇవి భాషా భేదాలకు అతీతంగా ఉంటాయి కాబట్టి, వేర్వేరు భాషలకు చెందిన వారు కూడా వీటిని సులభంగా అర్థం చేసుకొని ఆస్వాదించగలరు.

ఈ సార్వత్రిక ఆకర్షణే (universal appeal) క్యాప్షన్ లేని కార్టూన్లకు పాఠకుల నుండి ఇంతటి విస్తృతమైన ఆదరణ లభించడానికి ప్రధాన కారణమని నేను నమ్ముతున్నాను"అంటూ కాప్షన్‌లెస్ కార్టూన్లపై తమ అభిప్రాయం తెలియజేశారు.

గత నాలుగు దశాబ్దాలకు పైగా కార్టూనింగ్ వీరి జీవితంలో ఒక ప్రధాన భాగమైంది.

భవిష్యత్తులో యువకులు ఈ అద్భుతమైన కళను ఆదరించి ఈ రంగంలోకి వస్తారని ఈ కార్టూనిస్ట్ హృదయపూర్వకంగా ఆశిస్తున్నారు.

తరతరాలుగా ఈ కళను ముందుకు తీసుకెళ్లడం చూసి నేను చాలా సంతోషిస్తాను అని మనస్ఫూర్తి గా చెబుతున్న శ్రీ సదాశివన్ ఇరియన్ని గారు ఈ కార్టూన్ కళకి మరిన్ని సేవలందిస్తారని, తన కార్టూన్ల ద్వారా మరింతమందికి ఎంతో కాలం మరిన్ని నవ్వులు పంచుతారని ఆశిద్దాం.




**గమనిక:** మా పాఠకుల సౌలభ్యం కోసం క్యాప్షన్‌లు తెలుగులోకి అనువదించబడింది.






**ఈ నెల రచయితలు:**

**✦ వింజమూరి శర్మ ✦ సీతా జానకి సూరిశెట్టి ✦ స్నిగ్ధ సుస్మిత**

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో నానా పాట్లు పడుతుంటాడు.

(గత సంచిక తరువాయి)

## ఇరవై ఐదవ సీన్– వింజమూరి శర్మ

**"అమ్మ! ఏం లేదు... ఇదంతా సినిమా షూటింగంతే, నాకేం కాలే... నువ్వేం దిగులు పడొద్దు!" అని నిజమైన హీరోలా చాముండేశ్వరిని సముదాయిస్తూనే మనసులో ఆ సురేష్‌ని ఏదో విధంగా ఈ సినిమా షూటింగ్ సమయంలోనే తొక్కి పెట్టి, ప్రతిభను తన స్వంతం చేసుకోవడమే తన అంతిమ లక్ష్యం అనే ఉద్దేశంతో సురేష్ తన కడుపులో గుద్దిన బాధను దిగమింగుకుని, నవ్వుతూ మాట్లాడుతూ తన తల్లిని సముదాయించే ప్రయత్నం చేస్తున్నాడు.**

## ఇరవై ఆరవ సీన్–సీతా జానకి సూరిశెట్టి

గణేష్ మనసులో రింగులు తిరగడం ఆగిపోగానే మొహంలోకి ఆశ్చర్యం తీసుకొచ్చింది.

"మీరా మేడమ్! ఎక్కడో చూసినట్టుంది అనుకొంటున్న. ఇంగ ఇప్పుడు గుర్తుకొచ్చే. అదిగో గాడ సోఫాలో కూకొండ్రి!" అంటూ హడావిడి చేశాడు.

"ఒరేయ్ అప్పుడు నన్ను పిన్నిగారు అని పిలిచేవాడివి కదురా! ఇప్పుడు ఈ కొత్త పిలుపు ఏమిటి?"

గణేష్ తల గోక్కుంటూ నవ్వాడు.

"గట్లనే పిలుస్త బాయ్ చిన్నమ్మా!" అన్నాడు నవ్వుతూ.

గణేష్ తన అనుచరులతో హడావిడిగా...

"ఒరేయ్ రంగా! మీరంతా బండి తీయండి. చిన్నమ్మను ఇంటికాడ మర్యాదగా దింపి రండి. ఇగో శేషాచలం సారూ! మీరెవరో ఇగ నాకు దెలిసిపాయె, సోంచాయించక చిన్నమ్మని అడిగి సురేష్‌కి జర ఎక్కువ ఇంపాటెంట్ (ఇంపార్టెంట్) వచ్చేలా సిన్మా తీయి... ఇగో సురేషా ఈ చిన్నమ్మ నాకు చిన్నప్పుటి సంది దెలుసు. ఈ సారు ఆ చిన్నమ్మ తమ్ముడు. నీకు సైన్మా లో మంచిగ యాషం చూపమని చెప్తాలే, పో... పోయి ఆ దెబ్బకి మందు పెట్టించుకో." అంటూ...

"చిన్నమ్మా! భద్రంగా పోయి రా! మన పాత ఇశేషాలు ఇంకోపాలి చూసుకుందాం. రంగా అక్కకి పనస పండు సానా ఇష్టం, పోయేటప్పుడు ఓ పండు ఇంటికాడ ఇచ్చి రండి"

రంగా "అలాగే అన్నా! పొండి మేడం, శేష్ సారూ..." అంటూ జీపులో ఎక్కిన తర్వాత, పనసపండ్ల బండి దగ్గర ఆపగానే, రాజ్యం పిన్ని గభాలున దిగి వలిచిన పనస తొనలు, పనస పొట్టు, పనస గింజలు, ఓ రెండు పనస కాయలు తీసుకుని జీపెక్కింది.

రంగా కనుసైగతో రవి డబ్బు ఇచ్చి, పరిగెత్తుకుంటూ వచ్చి జీపు ఎక్కాడు.

రవి– "గివి ఏంది! నేనెపుడూ జూడలే... రంగన్నా!"

"గివి ఉత్తరాంధ్ర దిక్కుకెల్లి వస్తా ఉంటుండె, గీ మధ్య మన పట్నంలో అన్ని తావులా దొరక బట్టె. పనసకాయలు అంటారు, తొనలు, పొట్టు, గింజలు అన్ని అక్కరకొస్తై. గివి రాజ్యం అక్కకి పానమని అన్న ఇప్పియ్యమందు!" అని రవికి వివరించాడు.

ఈలోగా శేష్ ఇల్లు రావటంతో రాజ్యం విజయ గర్వంతో ఇంట్లోకి అడుగులు వేసింది.

వెనుకే శేషాచలం, రంగా, రవి... చేతుల నిండా పనసకాయలు, మిగిలిన పొట్లాలు తెచ్చి

హాలులో టీపాయ్ మీద ఉంచి... "మరి పోతుండాం సారూ!" అంటూ జీపులో అడ్డా దగ్గరకు బయలుదేరారు.

కాంతం లోపల్నించి వస్తూ... " ఏంటి అత్తయ్యా ఇవన్నీ?!" అంది.

రాజ్యం, విజయగర్వంతో నవ్వుతూ– "ఇక శేష్‌కి ఆ గణేష్ అంటే భయం లేదు." అంది.

కాంతం, "ఏవిటీ!? గణేష్ అంటే భయం ఎందుకు లేదంటా?..." అంటూ సూర్యకాంతం టైపులో ఎడం చేతిలో ఉన్న గరిట తిప్పుతూ అంది. (వంటింట్లో పులుసు కలుపుతూ ఉంటే, చప్పుడు రాగానే బయటకి అలానే వచ్చింది మరి.)

శేష్ ధైర్యంగా ఫ్రెష్ అవటానికి లోపలికి వెళ్ళాడు.

గణేష్ అంటే వణికే భర్త అంత ధైర్యంగా ఎలా మారాడో కాంతానికి అర్థం కాలేదు.

రాజ్యం ఆమె ఆశ్చర్యానికి నవ్వుతూ...



"ఇదిగో కోడలు పిల్లా! ఆ గణేష్ ఎవరనుకున్నావ్? మా చిన్నప్పుడు మా విజయనగరంలో మా పొలాలు కౌలుకి చేసే కుటుంబం. తాత, తండ్రి మా ఇంటే ఉండేవారు. మా చిన్నప్పుడు విజయనగరంలో ఘంటస్తంభం దగ్గర బజారుకి, పైడితల్లి అమ్మవారి గుడి దర్శనం చేసుకోవటానికి కలిసి వెళ్ళేవారం... అలా మన ఇంటే ఉండేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఇపుడు సురేష్ ఎలా ఉన్నాడో అలాంటి పోలికలతో కాస్త బలంగా ఉండేవాడు. వీళ్ళ నాయినకి వాళ్ళతో ఏదో గొడవొచ్చి ఆవేశంలో భార్యా, ఇద్దరు కొడుకులతో పట్నం చేరాడు. మరి ఎలా మారారో కానీ, ఈ ప్రాంతాన్ని ఏలేస్తున్నాడు.

ఇంత డబ్బు, దస్కం ఎలా సంపాదించాడో? పదేళ్ల పిల్లాడుగా చూసానా, మళ్ళీ ఇప్పుడు ఇలా చూస్తున్నా... ఈ మార్పు ఎలా వచ్చిందో? పద ఈ పనస గింజలు సాతాళింపు చేయి, పనసపొట్టు ఆవ కూర నేను చేస్తాను. అవన్నీ అయేలోపు ఈ పనస తొనలు తిందాం. నాకు, శేష్‌కి చాలా ఇష్టం." అంటూ కాంతానికి సంచులు అందించింది.

కాంతం స్వగతంలో...'ఏవిటో ఇవంటే వలిచినవి తెచ్చారు కాబట్టి చేస్తాను. మరి ఈ కాయలెలా ఒలవనూ... ఏవంటే ఏం కొంప మునుగుతుందో అత్తగారితో' అని నోరు మూసుకుని లోపలికి వెళ్ళింది.

శేషాచలం సోఫాలో చేరగానే... కాంతం తొనల నుంచి గింజలు తీసి, తొనలను పళ్ళెంలో పెట్టుకుని తెచ్చి అందించింది.

శేషాచలం ఆనందంగా అందుకుని తన చిన్ననాటి తీపి గుర్తుగా ఉన్న తియ్యటి తొనలు తింటూ, సినిమా తీసే విషయంలో గణేష్ నుంచి ఎదురయే అడ్డు తొలగటంతో పనస తొన మరింత తీయదనాన్ని ఇచ్చింది.

రాజ్యం కూడా తొనలు నోట్లో వేసుకుంటూ... "కాంతం రా! నువ్వు కూడా నాలుగు తొనలు తిను, ఆవకూర నేను చేస్తాలే!" అంది.

కాంతం లోపల్నించి వస్తూ ఏవిటీ వీళ్ళిద్దరూ భయంతో వెళ్ళి, ధైర్యంతో వచ్చారు. పోనీలే ఇక ఎలాంటి గండాలూ లేకుండా పోయింది, ఇక సినిమా నిరాటంకంగా వేగంగా సాగుతుంది. పిల్లలు వచ్చేఏడు వస్తామన్నారు కూడానూ... వాళ్ళు వచ్చేసరికి ఈ కార్యక్రమానికి స్వస్తి చెప్పి, పిల్లలతో గడపటానికి ఆలోచించుకోవచ్చు అనుకుంది. తనూ ఓ రెండు తొనలు తినసాగింది.

శేషాచలం తన ఆలోచనలలో రేపంతా ఎలాంటి సన్నివేశాలు







చిత్రీకరణ చేయాలో వాటిగురించి బులెట్ పాయింట్లు తన కాపీలో రాసుకోసాగాడు.

అటుగా వచ్చిన రాజ్యం పిన్ని అది చూసి తృప్తి పడింది.

పోనీలే పిల్లాడు పనిలో పడ్డాడు... ఇక ఆరోగ్యం కుదుటగా ఉంటుంది అనుకుంటూ కరివేపాకు కోసుకుని లోపలికి వెళ్ళింది.

## ఇరవై ఏడవ సీన్–
## స్నిగ్ధ సుస్మిత

కాంతం కలిపిన ఇన్స్టాంట్ కాఫీ తాగుతూ పొద్దున్నే బాల్కనీలో నిల్చున్న శేషాచలానికి, షూటింగ్‌లో జరిగే రభసకు... మనసంతా గందరగోళం చిందరవందరగా అవుతోంది.

అసలు తన షూటింగ్‌కి ఏదో దోషం పట్టిందేమో అని అనుమానం మొదలయ్యి...అలా అలా సముద్రంలో అల్పపీడనం లాగా బలపడిపోయింది.

అవును! పెద్ద పెద్ద హీరోలు కూడా సెంటిమెంట్ సీన్లతోతో స్టార్ట్ చేస్తారు షూటింగ్... అందుకే లేడీస్ ఫస్ట్ పాలసీతో ముందుకు పోవాలని నిశ్చయించుకున్నాడు.

'ఇంటికి దీపం ఇల్లాలు...ఆడదే ఆధారం' అనుకుంటూ...ఈ రోజు స్త్రీమూర్తుల మీద షూటింగ్ చేయాలి అని నిశ్చయించి, మొదలు ఏకనాథంకు విషయం చెప్పాలి అనుకోని... కాల్ కలిపాడు.

"కుచ్‌తో లోగ్ కెహేంగే... లోగోంకా కామ్ హై కెహెనా..."

'కాలర్‌ట్యూన్ అందరు వినాలని కాల్ ఎత్తడం ఆలస్యం చేస్తున్నాడా ఈ ఏకనాథం?' రెండు సార్లు రింగు చేసినా కాల్ ఎత్తకపోయేసరికి శేషాచలానికి అనుమానం వచ్చింది.

అది ముందుకు పోయి బలపడకముందే, ఏకనాథం కాల్ లిఫ్ట్ చేసాడు.

"హలో! ఏకానాథం... ఈ రోజు షూటింగ్ హీరో తల్లి, హీరోయిన్ తల్లి బజారులో కలిసే సన్నివేశం... మన అపార్ట్మెంట్‌లో ముందు భాగంలో తీస్తున్నాము... పొద్దున్నే 8గంటల నుండి, 11 గంటల వరకు రకరకాల కూరలు, పూలు, పండ్లు అమ్మే బండ్లు వస్తాయి... ఆ సమయంలోనే మనం షూటింగ్ పెట్టుకుంటే మనకు ఖర్చు కలిసివస్తుంది... సీన్ కూడా సహజంగా ఉంటుంది. కాబట్టి నువ్వు 8 కొట్టేసరికల్లా ఇక్కడ ఉండాలి. పాత కాలం కొరియర్ సర్వీస్‌లాగా ఆలస్యంగా కాకుండా,జెప్టో ఆర్డర్ లా పది నిమిషాల్లో ఫాస్టుగా ఉండాలి. అర్ధమయిందా?!" అని ఏకానాథంకు మధ్యలో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, మాట పాఠం లాగా అప్పాజెప్పాడు శేష్.

ఏకనాథం సమ్మతం తెలుసుకొని... కాల్ కట్ చేసాడు.

ఇప్పుడు నాయిక, నాయకుల తల్లులకు విషయం చెప్పాలి.

'మొదట కాంతానికి షూటింగ్ విషయం చెప్పి సర్ప్రైజ్ చేయాలి...'అనుకుంటూ...రాని ఈలతో వచ్చిన పాటలు కలిపిపాడుతూ...









జోరుగా వంటింట్లోకి వచ్చి స్పీడుగా కాంతా నికి షూటింగ్ స్టార్టింగ్ గురించి చెప్పాడు.

కాంతం ముఖంలో కనపడ బోయే ఆనందశ్చర్యాద్భుత మిళిత కవళికలకై కాపు కాసి... ఓరకంట చూస్తున్న శేషానికి, కాంతం మొహం లోని నిశ్చేష్టం నీరసం తెప్పించింది..

“అదేమిటి కాంతం!... ఈ రోజు నీ షూటింగ్ మొదటి రోజు. బీరువాలో ముక్కి ములుగుతున్న, నీ ఆర్.ఎస్ బ్రదర్స్, జె.సి.బ్రదర్స్, మీ బ్రదర్స్, మాసిస్టర్స్, వరమహాలక్ష్మి, మాఇంటి శ్రీలక్ష్మి, అన్ని షాపుల చీరలకు న్యాయం చేసి, వాటి జన్మ తరింపచేసే... కార్తీక మాసంలో ఆషాడం ఆఫర్ లాంటి ఛాన్స్ వచ్చే విషయం చెప్తే... పాత మల్లీశ్వరి హిట్‌లాగా కాకున్నా కనీసం కొత్త మల్లీశ్వరి రిజల్ట్ లాగా కూడా ఎక్స్ప్రెషన్ ఇవ్వట్లేదు!” అని ఆవేశయాస పడిపోయాడు శేష్.

టీ వీ చూస్తున్నప్పుడు అయిదు నిముషాలు యాడ్స్ టైమ్‌లో లేవడం టైమ్ వేస్ట్ అని,అలాగే సీరియల్ చూస్తూ కూచుంటే... పెనం మీద మర్చిపోయిన పెసరట్టులా ముఖం పెట్టుకొని శేష్ వైపు చూసింది కాంతం.

“ఊర్వశి ఈరోజు రావట్లేదు అటండీ!” అని చెప్పి నిస్త్రాణల నిల్చుంది కాంతం.

పక్కలో బాంబు కాదు... కాదు, పక్కింట్లో డీజే పెట్టినట్టు అయింది శేష్ పరిస్థితి. ఊర్వశి లేకుంటే కాంతం లేదు. ఊర్వశి రాకుంటే అపార్ట్మెంట్‌లో ఆడవాళ్లెవ్వరికీ, కాలు, చేయి, గుండె, మోకాళ్ళు ఏవీ లేనట్టే. ఊర్వశి మా ఇంటి పనిమనిషి. అమ్మో!... కాంతం వింటే... తప్పు! తప్పు... మా ఇంటి మహా మనిషి... అలాంటి ఊర్వశి రాకుంటే కాంతమే కాదు, ఛాయదేవి కూడా షూటింగ్‌కు రాదు. వెంటనే ఆలోచన చేసి కాంతంకి చెప్పి, ఆ విషయం ఛాయదేవికి కూడా చేరవేయమని చెప్పాడు.

20నిముషాల తరువాత...

డోర్ దగ్గర నిల్చున్న కుర్రాడు పరిచయం చేసుకుంటున్నాడు. “హలో! సార్... వియ్ ఆర్ ఫ్రమ్ మీ అంట్లు మా పాట్లు! రెండు ఇల్లల్లో గిన్నెలు కడగడానికి స్లాట్ బుక్ చేసారు కదా?... అందుకు వచ్చాను.” ఆన్లైన్ అబ్బాయి పరిచయం చేసుకుని... పనిలో జాయిన్ అయి పోయాడు.

గిన్నెలు కడిగి పెట్టడంతో, సగం పని తప్పి, త్వరత్వరగా హెయిర్‌డ్రైతో, పాతిక వేలపట్టు చీరతో... అపార్ట్‌మెంట్ కింద షూటింగ్‌కి సిద్ధం అయ్యారు... నాయిక, నాయకుల అమ్మలు, (అమ్మ పాత్రధారులు). **(సశేషం)**




హాస్యానందం అభినందనలు Congratulations

**మహారాష్ట్ర ప్రభుత్వ పాఠ్య పుస్తకంలో వడ్డేపల్లి కథకు చోటు**



ప్రముఖ కార్టూనిస్ట్, బాలల సాహితీవేత్త... **వడ్డేపల్లి వెంకటేష్** రచించిన– పిల్లల జాబిల్లి కథా సంకలనం నుండి **‘తిమ్మప్ప–మామిడిటెంక’** అనే కథకు మహారాష్ట్ర ప్రభుత్వ 3వ తరగతి తెలుగు వాచకం ‘బాలభారతి’ లో స్థానం దక్కింది. పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాధాన్యతను తెలియజేసే ఈ కథ బాగా ప్రాచుర్యం పొందింది.

“తన కథను మహారాష్ట్ర ప్రభుత్వంవారు తీసుకోవడం చాలా ఆనందాన్ని కలిగించింది. కథకు నగదుతో పాటు రాయల్టీ కూడా ఇచ్చారని అన్నారు. మరిన్ని అర్థవంతమైన, పిల్లలకు ఆసక్తికరమైన, నైతిక విలువలు నేర్పే బాలల కథలను మరిన్ని రాస్తాన”ని అన్నారు.

వడ్డేపల్లి, కార్టూన్లు10వేల వరకు వేసారు. పిల్లల కథలు, ‘ఈనాడు హాయ్ బుజ్జీ’, ‘బాలభారతం’ లో 200 కి పైగా ప్రచురితం. పిల్లల జాబిల్లి పుస్తకానికి రెండు అవార్డులు వచ్చాయి. సిద్ధిపేట శ్రీవాణి కళాపీఠం నుండి ఉత్తమ గ్రంథంగా ఎంపిక, స్నిగ్ధారెడ్డి బాల సాహిత్య పురస్కారం.




ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందం కోసం వే(గీ)సే కార్టూన్లు!

ఇక నుండి 'నెల నెలా నవ్వుల వెన్నెల' శీర్షికలో ప్రచురించబడిన ఒక కార్టూన్‌కి లాటరీ ద్వారా ఎంపిక చేసి **200 రూపాయలు** పారితోషికం ఇవ్వబడుతుంది.
సెప్టెంబర్ 2026 సంచిక విజేత **శ్రీషేక్ సుభానిగారు.**
బహుమతి ఇచ్చిన వారు- **శ్రీమతి పద్మ!**

## ఈ నెల అంశం- కంటి డాక్టర్

నిర్వహణ: లాల్



















నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి
నేత్రదానం మహాదానం
నాకు పిల్లి కళ్ళంటె చాలా ఇష్టం డాక్టర్... దీని కళ్ళు తీసి నాకు పెట్టండి...
మియావ్
డా.ద్వినేత్ర
EYE SPECIALIST


E
F P
T O Z
L P E D
P E C F D
E D F C Z P




నా పూర్తి ఫీజు – ఇలా పడేయ్!
నీ కన్ను - అలా పెట్టేస్తా!!
డా.. ఖచ్చిత్
కంటి వైద్య నిపుణులు


కనిపించలేదు డాక్ట్రగారు.
'హాఁ.. కనిపించింది కనిపించింది.


మీరిచ్చిన ఐ డ్రాప్స్ వాడాక..కళ్ళు బాగానే ఉన్నాయ్..సార్
ఇంకా వాడాలంటారా..
ఖచ్చితంగా..ఎందుకంటే.. నేను కళ్ళు డాక్టర్ కాదు..
డా॥ సహనం
గైనకాలజిస్టు


ప్రపంచంలో తొలి కంటి వైద్యం ఎవరు చేసారమ్మా...
ఐ స్పెషలిస్ట్ ఇంటర్వ్యూలు
భక్త కన్నప్ప సార్...


బోర్డుపై ఉన్న అక్షరాలు కళ్ళు పెట్టి సరిగా చూడు ముందు అక్షరం 'm' ఉంటే 'D' అంటావేమిటి?
డాక్టర్: చీకట్లురావు
నేత్ర వైద్యుడు
DEL
ASG
ORM



కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | ✿ | 3 | | 4 |
| | ✿ | ✿ | 5 | | | ✿ | |
| 6 | | ✿ | | ✿ | | ✿ | |
| | ✿ | 7 | ✿ | 8 | | 9 | |
| 10 | | | | ✿ | ✿ | | ✿ |
| ✿ | ✿ | | ✿ | 11 | | | 12 |
| ✿ | 13 | ✿ | 14 | | ✿ | ✿ | |
| 15 | | | | ✿ | 16 | | |

## ఆధారాలు

**అడ్డం:**

**1.** ఈ గొప్ప కవి ఇంటిపేరు వేములవాడ **(4)**
**3.** -------- గీపెట్టడమని పదప్రయోగం **(3)**
**5.** వంతెన **(3)**
**6.** దీనితో చెలగాటమాడకూడదుట **(2)**
**8.** సాగుబడికి పనికిరాని భూమి **(4)**
**10.** చెన్నై ఒకప్పటిపేరు తిరగబడింది **(4)**
**11.** భార్య చెల్లెలు అటూఇటూ అయింది **(4)**
**14.** చిన్నపొద, డొంక **(2)**
**15.** తొమ్మిదిరోజుల తెలంగాణ పూలపండుగ **(4)**
**16.** కలత, భయం **(3)**

**నిలువు:**

**1.** ఉత్తరాంధ్రలోని ఈ ప్రదేశాన్ని భీమిలి అని కూడా అంటారు **(5)**
**2.** కొందరిమధ్య కొలిక్కిరాని సమస్య, తగవు **(3)**
**3.** నాయకులు దీనికోసం వెంపర్లాడతారు **(4)**
**4.** ప్రముఖ రచయిత బుచ్చిబాబు రచన ------మిగిలేది **(4)**
**7.** శివభక్తుడైన ఇతడు భక్తకన్నప్పగా మారాడు **(3)**
**9.** పల్లకీ మోసేవారు **(3)**
**11.** చిన్నరాయి అని అర్థంవచ్చే ఈ మాటను 'రాయి' తోటే వాడతారు **(2)**
**12.** నవరాత్రి ఉత్సవాలను ఇలాకూడా పిలుస్తారు **(3)**
**13.** తీవ్రమైన శత్రుత్వం ఉంటే ----------- చూస్తామనుకుంటారు **(2)**
**14.** ఈముళ్ళమొక్క నుంచి జిగురు కూడావస్తుంది **(2)**

## పదానందం-35 సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 బ | ల్లి | 2 క | ట్టు | | 3 వి | జ | 4 యం |
| ర్ధ | | బు | | 5 | | | డ |
| 6 కం | 7 గా | రు | | 8 డు | 9 ప | ద | మూ |
| | రా | | 10 క్రా | | లు | | రి |
| 11 అ | ల | వో | క | | 12 క్కు | ళ్ళ | |
| | ప | | 13 ర | మ్మె | బ | | 14 చి |
| 15 ము | ళ్లి | కా | యు | | 16 డి | బ | రా |
| ర | | | 17 క్రా | కి | | | కు |




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P



Brewstark®
Clothing
MEN'S
ESSENTIALS
TIMELESS STYLE
FOR EVERYDAY LIFE
SHIRTS | T-SHIRTS | TROUSERS
JEANS | & MORE
Classic Looks Timeless Style
BEIGE
RED
BROWN
BLUE
PINK
PREMIUM FABRICS
QUALITY STITCHING
EVERYDAY VERSATIILITY
MODERN STYLES
Brewstark
S-17, Jubilee Hills Road no.10C,
Hyderabad-500033
Ph:
9063922411

Hasyanandam October-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC

# శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం

ఇంద్రకీలాద్రి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్



శ్రీ పరాభవ నామ సంవత్సర

# దసరా మహోత్సవములు-2026

తేది.11.10.2026 ఆదివారం, ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి
తేది. 20.10.2026 మంగళవారం, ఆశ్వీయుజ శుద్ధ దశమి వరకు.

## దసరా మహోత్సవములలో శ్రీ కనకదుర్గ అమ్మవారి దివ్య అలంకారములు

| | | | |
|---|---|---|---|
| తేది.11.10.2026 | ఆదివారం | అశ్వయుజ శుద్ధ పాడ్యమి | శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి |
| తేది.12.10.2026 | సోమవారం | అశ్వయుజ శుద్ధ విదియ | శ్రీ గాయత్రీ దేవి |
| తేది.13.10.2026 | మంగళవారం | అశ్వయుజ శుద్ధ తదియ | శ్రీ అన్నపూర్ణా దేవి |
| తేది.14.10.2026 | బుధవారం | అశ్వయుజ శుద్ధ చవితి | శ్రీ మహాచండీ దేవి |
| తేది.15.10.2026 | గురువారం | అశ్వయుజ శుద్ధ పంచమి | శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి |
| తేది.16.10.2026 | శుక్రవారం | అశ్వయుజ శుద్ధ షష్ఠి | శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం) |
| తేది.17.10.2026 | శనివారం | అశ్వయుజ శుద్ధ సప్తమి | శ్రీ మహాలక్ష్మీ దేవి |
| తేది.18.10.2026 | ఆదివారం | అశ్వయుజ శుద్ధ అష్టమి | శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి) |
| తేది.19.10.2026 | సోమవారం | అశ్వయుజ శుద్ధ నవమి | శ్రీ మహిషాసురమర్ధిని దేవి (మహర్నవమి) |
| తేది. 20.10.2026 | మంగళవారం | అశ్వయుజ శుద్ధ దశమి | శ్రీ రాజరాజేశ్వరి దేవి (విజయదశమి) |



తేది. 20.10.2026 మంగళవారం, ఆశ్వీయుజ శుద్ధ దశమి రోజు సాయంత్రం పవిత్ర కృష్ణానదిలో
**హంసవాహన తెప్పోత్సవం**



పూర్తి వివరములకు
దేవస్థానం టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 1800 425 9099 మరియు www.tms.ap.gov.in పై సంప్రదించగలరు.

సదా శ్రీదుర్గామల్లేశ్వరుల సేవలో...

**బి.రాధాకృష్ణ (గాంధీ)**
చైర్మన్ & ధర్మకర్తలమండలి సభ్యులు

**వి.కె.శీనా నాయక్**
స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీకలెక్టర్ & కార్యనిర్వహణాధికారి